
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
5
శనివారం 11 అక్టోబరు 2025



గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.4

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	83,848	83,848
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.28 (4.27)	5,838.15	6,826.79
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.653 (43.7429)	82,492	82,492

చికెన్ ధరలు | లైవ్: రూ.140 | డ్రెస్: రూ.210 | స్కిన్‌లెస్: రూ.240

నకిలీ లెక్చరర్లలో కలకలం

- తదుపరి చర్యలకు ఇంటర్‌బోర్డు సిద్ధమైనట్లు సమాచారం
- ఇప్పటికే ఆర్‌జేడీని బాధ్యతల నుంచి తొలగింపు
- ఆరా తీసిన రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు
- చర్యలను నిలపాలని కీలక నేతలను ఆశ్రయించిన నకిలీ లెక్చరర్లు
- వారికి హామీ దక్కలేదని సమాచారం



నల్లగొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నకిలీ లెక్చరర్లు!' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో శుక్రవారం ప్రచురితమైన కథనం ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాల్లో కలకలం రేపింది. రాష్ట్ర వ్యాప్తంగా 2023లో క్రమబద్ధీకరణ పొందిన జూనియర్ లెక్చరర్లలో 700 మంది వరకు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు విచారణలో తేలిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీంతో ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు నకిలీలపై తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిణిని సెప్టెంబరు నెలాఖరులో ఆర్‌జేడీ బాధ్యతల నుంచి తప్పించినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా ఈ కథనంపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు సైతం శుక్రవారం వివరాలు సేకరించారు. నకిలీల వ్యవహారాలపై అన్ని ఆధారాలతో ఉన్నతాధికారులకు, సీబీసీఐడీకి ఫిర్యాదులు చేయడంతో పాటు, సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసిన నిరుద్యోగ జేఏసీ, తెలంగాణ విద్యారంగ పరిరక్షణ సమితి నాయకుల నుంచి వారు అన్ని వివరాలు సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇంటెలిజెన్స్ అధికారులు హైదరాబాద్, హన్మకొండ, నల్లగొండలో సమాచారం సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నకిలీ సర్టిఫికెట్ల దందాపై చర్యలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో తమ పరిస్థితి ఏంటనే దానిపై ఇటు నకిలీ లెక్చరర్లు, వారికి మద్దతుగా నిలిచిన జిల్లాల అధికారులు, ఉద్యోగసంఘాల నాయకులు హైరానా పడుతున్నారు. రాజకీయనేతల నుంచి ఒత్తిడి తెచ్చి చర్యలు తీసుకోకుండా అడ్డుకునేందుకు తదుపరి ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే కీలక నేతలు హామీ ఇవ్వడం లేదని, ఈ అంశం తమ పరిధి దాటిందని, కొన్నాళ్లు వేచి ఉండాలని సూచిస్తున్నట్లు చర్చ సాగుతోంది.

ఆందోళనలో బాలాజీ బాధితులు

- అతడి వ్యవహారాలపై పోలీస్‌శాఖ దృష్టి
- ఆస్తులు, దందాలపై ఆరాతీస్తున్నట్లు సమాచారం
- బాలాజీని పట్టుకునేందుకు రంగంలోకి పోలీసులు



నల్లగొండ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశచూపి భారీగా నగదు సమీకరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలాజీ నాయక్ లావాదేవీలపై పోలీస్‌శాఖ దృష్టి సారించింది. ఇప్పటికే మనీలాండరింగ్, డిపాజిటరీల చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ సాగిస్తున్నారు. బాలాజీకి సంబంధించిన ఆస్తులు ఎక్కడెక్కడున్నాయనే అంశాలతో పాటు, అతడు ఈ వ్యాపారానికి ఉపయోగించిన బ్యాంక్ అకౌంట్లను పరిశీలిస్తున్నారు. అదేవిధంగా బాలాజీ, అతడి కుటుంబ సభ్యులు, అతడి వద్ద పనిచేసిన ఇతర ఉద్యోగుల వివరాలు, వారిపేరున నడిపిన లావాదేవీలు, వారి పేరున ఉన్న ఆస్తుల వివరాలను సైతం సేకరిస్తున్నట్లు తెలిసింది. దాదాపు 22 బ్యాంక్ అకౌంట్ల ద్వారా బాలాజీనాయక్ లావాదేవీలు నడిపినట్లు తెలుస్తుండగా, వాటన్నింటినీ పరిశీలిస్తున్నట్లు సమాచారం మరోవైపు బాలాజీ ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. బాలాజీ నాయక్ పాస్‌పోర్టు సైతం నల్లగొండ పోలీస్‌లు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో దేశం విడిచిపోలేదని, అతడు ఎక్కడున్నా వెతికి పట్టుకొని ఒకటి, రెండు రోజుల్లో రిమాండ్‌కు తరలిస్తామని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. బాలాజీనాయక్‌కు అప్పులిచ్చి ఇబ్బందులు పడుతున్న కారణంతో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారనే సమాచారం, అతడి స్వగ్రామమైన వద్దిపట్ల గ్రామపంచాయతీ పలుగుతండాలోని ఇంటిపై దాడికి దిగిన విషయాలు బయటకు రావడంతో అప్పులిచ్చిన వారు పెద్దసంఖ్యలో నల్లగొండలో ఎస్పీ కార్యాలయానికి వస్తున్నారు. అయితే వారెవరూ నేరుగా ఫిర్యాదులు ఇవ్వకుండా డబ్బులిప్పించేలా చూడాలని పోలీసులను వేడుకుంటుండడం గమనార్హం. తాజా గా, శుక్రవారం నల్లగొండలో పలువురు గిరిజన సంఘాల నాయకులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ బాలాజీనాయక్ నమ్మకంతో పలువురు గిరిజనుల నుంచి వందల కోట్ల రూపాయలు డబ్బు సేకరించాడని, వారంద రూ ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బాలాజీ వ్యవహారంపై పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని, అతడి వెనక ఉన్న వా రి వివరాలు సైతం వెల్లడించాలని డిమాండ్ చేశారు. బాలాజీ ఎవరెవరికి విరాళాలు ఇచ్చారనే అంశాన్ని సైతం తేల్చాలని డిమాండ్ చేశారు. ఆదివారంలోగా బాధితులకు ఉపశమనం కలిగే చర్యలు తీసుకోకపోతే నల్లగొండలో నంగారాభేరీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తామని ఆ సంఘం నాయకులు శ్రీనునాయక్, గణేశ్ నాయక్, రమేష్‌నాయక్, తదితరులు తెలిపారు.



మద్యం దుకాణాలకు దరఖాస్తులు తక్కువగా రావడానికి కారణాలు ఏమిటనే దానిపై ఎక్సైజ్‌శాఖ మల్లగుల్లాలు పడుతోంది. దరఖాస్తుల సంఖ్య తగ్గడం అనేది రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. దీంతో కారణాలను వెతికి రానున్న రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెంచుకునేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

సిండికేట్లపై ఎక్సైజ్‌శాఖ నిఘా

- దరఖాస్తులు తక్కువగా రావడంపై ఆరా
- 15 రోజుల్లో వచ్చినవి 96 దరఖాస్తులే
- దరఖాస్తులు తగ్గితే రీ-నోటిఫైకు ఆలోచన
- ప్రభుత్వ ఆదాయానికి గండి పడితే చర్యలకు ఉపక్రమణ

మద్యం టెండర్లకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై 15రోజులైనా జిల్లాలో మొత్తం 96 దరఖాస్తులే వచ్చాయి. ఈనెల 11న రెండో శనివారం అయినా సెలవు లేకుండా దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించారు. రానున్నవి మంచి రోజులే కావడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్‌శాఖ భావిస్తోంది. దసరాకు ముందే మద్యం టెండర్లకు నోటిఫికేషన్ జారీ కాగా, గత నెల 26 నుంచి దరఖాస్తులు తీసుకునే ప్రక్రియను ప్రారంభించారు. ఈనెల 18తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది. దసరా పండుగకు భారీగా దరఖాస్తులు వస్తాయనే నమ్మకంతో ముందుగానే నోటిఫికేషన్ జారీ చేసినా, రెండు వారాలు దాటినప్పటికీ దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగానే సాగుతోంది. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చేందుకు గతంలో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండగా, ఈ సారి ప్రభుత్వం దాన్ని రూ.3లక్షలకు పెంచింది. అయితే దరఖాస్తులు ఎక్కువగా రాకపోవడానికి ఫీజును లక్ష రూపాయలకు పెంచడమే కారణమా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈనెల 23వ తేదీన లాటరీ విధానంలో దుకాణాలు కేటాయించాల్సి ఉంది. ఈనెల 18తో దరఖాస్తుల ప్రక్రియ ముగియనుండగా, దరఖాస్తులు తక్కువగా వస్తే ఏం చేయాలనే దానిపై ప్రభుత్వంతో పాటు ఎక్సైజ్‌శాఖ అధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

సిండికేట్‌తోనే దరఖాస్తులు తగ్గాయనే అనుమానాలు

దరఖాస్తులు తగ్గడానికి మద్యం వ్యాపారాల్లో తలపండిన కొందరు సిండికేట్‌గా మారి ఆయా దుకాణాలకు దరఖాస్తులు రాకుండా నయానో భయానో నచ్చజెబుతున్నట్లు ఎక్సైజ్‌శాఖ గ్రహించినట్లు సమాచారం. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు రాకుండా చూస్తుండటంతో ఆ దుకాణాలకు రీనోటిఫై చేసి మళ్లీ దరఖాస్తులు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఈనెల 18లోగా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకుంటే సిండికేట్ అయినట్టుగా భావించి ప్రభుత్వం ఆదాయానికి గండి పడకుండా నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సిండికేట్లపై చట్టపర చర్యలు తీసుకునేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయం పెద్ద ఎత్తున రావాలంటే సెలవు రోజులు మినహా ఈ ఎనిమిది రోజుల్లో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రాబడితే కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మద్యం షాపుల యజమానులతో పాటు బార్ల యజమానులు కూడా సిండికేట్‌గా మారినట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో దుకాణాల వారీగా గతంలో వచ్చిన దరఖాస్తులు తగ్గకుండా చూడాలని, అవసరమైతే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం రానున్న రోజులన్నీ మంచిగా ఉండటంతో చివరి నాలుగైదు రోజుల్లో దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వస్తాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిర్భయంగా దరఖాస్తు చేసుకునేలా

మద్యం దుకాణాలకు నిర్భయంగా దరఖాస్తు

- మిగతా 8వ పేజీలో...

• ఉర్సులో భక్తుల రద్దీ



జిల్లా కేంద్రంలో లతీఫుల్లా షాఖాద్రీ ఉర్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం జరిగిన ప్రార్థనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



పీహెచ్‌సీలో రోగితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గొడకొండ్ల పంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి ఓపీ సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను మరింత మెరుగుపరచాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కల్యాణ్ చక్రవర్తి, వైద్యాధికారి వంశీకృష్ణ, తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈవో భిక్షపతి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

కేతేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివి పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో బొల్లారం భిక్షపతి, మండల ప్రత్యేకాధికారి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపికృష్ణ అన్నారు. శుక్రవారం కేతేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో భిక్షపతి, చెరుకుపల్లి కేజీబీవీని డీఎం గోపీకృష్ణ వేర్వేరుగా తనిఖీచేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. కేజీబీవీలో వంటగదిని పరిశీలించిన డీఎం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వారి వెంట ఎంఈవో ఎ.రాజేంద్రప్రసాద్, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎం.వసంత, ప్రధానోపాధ్యాయులు వి.రఘు, అశ్విని, సీఆర్పీ కె.మహేందర్, తదితరులు ఉన్నారు.

పేరూరు వంతెనను పునరుద్ధరించాలి

- అంచనాలు రూపొందించండి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీ వర్షాల కారణంగా తెగిన పేరూరు వంతన తాత్కాలిక పునరుద్ధరణకు అంచనాలు రూపొందించి సమర్పించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి పేరూరు శివారులో తెగిన వంతెనను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వంతెన తెగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అంచనాలు రూపొందించాలని, శాశ్వత ప్రాతిపదికన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి సైతం ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం అనుముల తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజేందర్, డీఈ సతీష్, ఏఈ సాయిరెడ్డి, మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, తహసీల్దార్ రఘు, ఎంపీడీవో సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, కాంసాని చంద్రశేఖర్, కాకునూరి నారాయణగౌడ్, రాంబాబు, నాగరాజు, గౌస్, పాల్గొన్నారు.



పేరురులో బ్రిడ్జిని పరిశీలించి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డితో చర్చిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాణ్యమైన భోజనం అందించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): విద్యార్థులకు విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించాలని, అందులో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రం సమీపం ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ప్రభుత్వం అన్ని మౌలిక వసతులకు నిధులు మంజూరు చేసినా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

(ఆంధ్రజ్యోతి, నకిరేకల్): రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాటికల్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. ఆమె వెంట డీసీవో పత్యానాయక్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేశం ఉన్నారు.

యథావిధిగా 'ప్రజావాణి'

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికలను హైకోర్టు ఆదేశాలతో నిలిపివేసినందున ఈనెల 13న (సోమవారం) 'ప్రజావాణి' కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజలు 'ప్రజావాణి'కి హాజరై సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాలు



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు అనువైన స్థలాన్ని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ శుక్రవారం పరిశీలించారు. హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డును పరిశీలించారు. సుమారు నాలుగు ఎకరాల స్థలాన్ని మార్కెట్ యార్డులో సేకరించేందుకు ప్రభుత్వానికి నివేదిక అందించిన క్రమంలో త్వరలోనే అనుమతులు రానున్నట్లు తెలిసింది. తొలుత ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మించనున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకే సముదాయంలో ఏర్పాటు చేసేందుకు ఇక్కడి స్థలాన్ని సేకరించనున్నట్టు తెలిసింది. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ అనిల్, ఇన్‌చార్జి ఎంపీడీవో భిక్షంరాజు, ఎస్ఐ వీరశేఖర్, పీఆర్ ఏఈ సైదులు, నాగిరెడ్డి, గురునాధం, హనుమంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి



సాగర్ ఏరియా ఆస్పత్రిలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రి సిబ్బంది నిరసన

నాగార్జునసాగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న తమకు సకాలంలో వేతనాలు అందించాలని కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులు, సిబ్బంది డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆస్పత్రి ఓపీ బ్లాక్ ఎదుట వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సెప్టెంబరు నెల పూర్తయి 10 రోజులు గడుస్తున్నా నేటికీ వేతనాలు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ నెల 1వ తేదీనే వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల వేతనాలు ఆలస్యం అవుతున్నా సర్దుకుపోతున్నామన్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్ నిర్లక్షం వల్లే వేతనాలు ఆలస్యమవుతున్నాయని వాపోయారు. ఇక నుంచి ప్రతీ నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని, లేదంటే రాష్ట్ర జేఏసీ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ మోతీలాల్, చక్రవర్తి, ఫార్మసిస్ట్ శ్రీజ్యోతి, హెడ్ నర్స్ సత్తెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదు

బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు



నల్లగొండలో నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయపరంగా దక్కాల్సిన స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను హైకోర్టు ద్వారా నిలిపివేయించిన బీసీ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర హైకోర్టు స్టే ఇవ్వడానికి నిరసనగా శుక్రవారం బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు క్లాక్‌టవర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నేలపట్ల సత్యనారాయణ, దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడంతో బడుగు బలహీన వర్గాల నోటికాడి ముద్దను లాక్కున్నట్టు అయిందన్నారు. 80శాతం జనాభా ఉన్న బీసీలకు రావాల్సిన రాజకీయ వాటాను అగ్రవర్గాలు అనుభవిస్తూ, దేశ సంపదను స్వప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు. బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లను జీర్ణించుకోలేక హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసు వేశాయన్నారు. కోర్టులో కేసులు వేసిన ఆధిపత్య కులాల నాయకులకు, చట్టరూపం దాల్చకుండా చివరి వరకు ప్రయత్నించిన కొన్నిపార్టీల వైఖరికి నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు కేశబోయిన శంకర్ ముదిరాజ్, నల్ల సోమమల్లన్న, చొల్లేటి ప్రభాకర్, వైద్యుల సత్యనారాయణ, చిక్కుళ్ల రాములు, వాడపల్లి సాయిబాబా, గోలి విజయ్ కుమార్, జెల్లా ఆదినారాయణ, పుట్టా వెంకన్న, మిరియాల యాదగిరి, పసుపులేటి సీతారాములు, గంజి భిక్షమయ్యనేత, గుండె వెంకటేశ్వర్లు, జివ్వాజి ఇంద్రయ్య, చిలకరాజు సతీష్, మునాస ప్రసన్న, ఐతరాజు జనార్ధన్‌గౌడ్, నల్ల మధు యాదవ్, నేలపట్ల చంద్రశేఖర్, మాధవి, కర్నాటి యాదగిరి, కందుల వెంకటేష్, పాల్గొన్నారు.

పెన్షన్ ఉద్యోగుల హక్కు

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ ప్రభుత్వ భిక్షకాదని, ఉద్యోగుల హక్కు అని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. కేంద్రం వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన సీపీఎస్, ఎన్‌పీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల హక్కులను హరించే పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టాప్రా జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే ఐదు విడతల కరువు భత్యాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పందిరి శ్యాంసుందర్, కుకుడాల గోవర్ధన్, కొప్పు రామచంద్రం, కేసాని భిక్షంరెడ్డి, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, గుండాల భిక్షమయ్య, రాఫెల్, రాపోలు వెంకటేశం, పట్టేటి కృష్ణయ్య, అంజిరెడ్డి, పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో సాగాలి

మారుతున్న సమాజానికి తగ్గట్టుగా అన్నిరంగాల్లో బాలికలు విజయం సాధించేందుకు ఆత్మవిశ్వాసమే ముఖ్యం. బాలికలు విద్యాభ్యాసాలపై శ్రద్ధ చూపుతూ వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని, అదే సమయంలో సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉంటూనే ఏమైనా సమస్యలుంటే కుటుంబ సభ్యులతో పంచుకోవాలంటు న్నారు మహిళా ప్రముఖులు. బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని అభిప్రాయాలను తెలిపారిలా..

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

బాలికలు జాగ్రత్తగా ఉండాలి



బాలికలు అందరితో జాగ్రత్తగా ఉండాలి. సోషల్ మీడియాకు వీలైనంత వరకు దూరం పాటించాలి. ఇబ్బందులు ఎదురైతే తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రేమ, స్నేహం పేరిట ఆకర్షణలకు గురికావొద్దు. సీడబ్ల్యూసీ బెంచ్ ముందుకు వస్తున్న ఘటనల్లో, పోక్సో కేసుల్లో బాలికల అజాగ్రత్తలు కూడా వెలుగు చూస్తున్నాయి.

బండారు జయశ్రీ, సీడబ్ల్యూసీ చైర్మన్,

పరీక్ష ఫలితాల్లో బాలికలదే పైచేయి



అన్ని పరీక్షా ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధిస్తుండడం వారిలో ఉన్న ప్రతిభకు, పట్టుదలకు నిదర్శనం. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్న వారిలో మహిళల శాతం పెరిగింది. దీంతో బాలికలు చదువుపై మాత్రమే శ్రద్ధ చూపగలిగితే వివక్షతను అధిగమించవచ్చు. ఆర్థిక సాధికారత కూడా సాధించవచ్చు.

తోట నిర్మల, ప్రధానోపాధ్యాయురాలు

ధైర్యమే రక్షణ కావాలి



ధైర్యమే బాలికలకు రక్షణ. ఆత్మ విశ్వాసం ఉంటే అన్నిరంగాల్లోనూ రాణించవచ్చు. ఇందుకు కావాల్సిందల్లా ఏకాగ్రత, పట్టుదల, శ్రద్ధ. సాధారణ క్రీడలతో పాటు సాహస క్రీడల్లోనూ బాలికల శాతం గణనీయంగా పెరుగుతోంది. ఎవరెస్ట్ తదితర పర్వతాలను అధిరోహిస్తున్న ప్రతీ బృందంలో బాలికలు ఉంటున్నారు.

పడమటి అన్విత, పర్వతారోహకురాలు.

ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి



బాలికలు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి. ఉన్నతస్థానం సాధించే లక్ష్యంతో శ్రమించాలి. ఎలాంటి ఇబ్బందులనైనా ఎదుర్కొనేలా మానసికంగా సిద్ధంగా ఉండాలి. చదువును అశ్రద్ధ చేయవద్దు. సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలి.

డాక్టర్ కె.శ్రీజ, ఎంఎస్ ఆర్థోపెడిక్, జిల్లా ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాల.

అదును దాటుతోంది.. యూరియా ఏదీ?



నేరేడుచర్ల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల పాట్లు

నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలో యూరియా కోసం రైతులు సహకార సంఘాల ఎదుట ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం యూరియా అందించడంలో విఫలం కావడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్ల పరిధిలో యూరియా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అదును దాటుతున్నా సమయానికి యూరియా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెర్వు, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాల్లోని సహకార సంఘాల ఎదుట రైతులు యూరియా కోసం నిరీక్షిస్తున్నారు. పంట పొట్టదశలో ఉండటం, ఆయకట్టు చివరి ప్రాంతంలో నాట్లు ఆలస్యం కావడంతో యూరియా అవసరం ఏర్పడింది. డివిజన్‌లో సుమారు 1.40 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. 40 వేల ఎకరాల్లో పత్తి, మిర్చి పంటలు సాగుచేశారు. సుమారు 25వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 16వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారు. హుజూర్‌నగర్ మండలంలో 25 వేల హెక్టార్లలో వరి సాగుచేశారు. రెండు నెలలుగా సహకార సంఘాల వద్ద మహిళా రైతులు సైతం యూరియాకు ఎదురుచూస్తున్నారు. అమరవరం, లింగగిరి, వేపలసింగారం, బూరుగడ్డ సహకార సంఘాల వద్ద రైతులు క్యూలో చెప్పులు, కండువాలు వేసి గంటల తరబడి ఎదురు చూస్తున్నారు.

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలో ఉదయం నుంచే ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల ఎదుట రైతులు యూరియా కోసం బారులు తీరుతున్నారు. చివరిగా ఉన్నవారికి కొందరికి యూరియా కూడా అందకవెను తిరగాల్సి వస్తోంది. పంట ఆలస్యంగా వేసిన వారికి రెండోసారి యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు వేయని వారు కూడా ఉన్నారు.

మేళ్లచెర్వు: మండలవ్యాప్తంగా యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. యూరియా ఏ కేంద్రానికి వస్తుందో తెలుసుకోవడం వేకువజాము నుంచి బారులుతీరటం నిత్యం కనిపిస్తోంది. శుక్రవారం గ్రోమోర్ కేంద్రానికి లారీ యూరియా వచ్చిందని సమాచారంతో వేకువజామున సుమారు 600మంది రైతులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. కొంతమంది రైతులకు మాత్రమే యూరియా దొరకగా మిగిలిన రైతులు నిరాశగా వెనుతిరిగారు.

ఇంకా ఎప్పుడిస్తారు సారూ..

మునగాల : వానాకాలం సీజన్‌లో వరి ఏపుగా ఉండి పంట దిగుబడి రావాలంటే యూరియా చల్లాలి, లేకుంటే దిగుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అదును దాటుతోంది యూరియా ఎప్పుడిస్తారంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహకార సంఘాల ద్వారా యూరియాను అరకొరగా విక్రయిస్తున్నారని, సరిపడా లభించడం లేదని రైతులు తెలిపారు. మునగాల మండలంలో సాగర్ కాల్వ ఆయకట్టు, నాన్‌ఆయకట్టు రైతులు ఈ సీజన్‌లో భారీగా వరి సాగు చేశారు. అంతే కాకుండా పత్తి సాగు చేసిన రైతులకు యూరియా అవసరం ఉంటుంది. దీనికి అనుగుణంగా యూరియా సరఫరా కాకపోవటంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

ఆందోళన చెందవద్దు



యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇండెంట్ పెట్టాం. ఈ సీజన్‌లో అవసరమైన యూరియా అందించేందుకు కృషి చేస్తున్నాం. సహకార సంఘాలకు రాగానే సమాచారం అందిస్తున్నాం.

వ్యవసాయ శాఖ ఏడీఏ రవీందర్‌నాయక్, హుజూర్‌నగర్



కాపుగల్లులో యూరియా కోసం వేచిచూస్తున్న రైతులు

సగం కూడా ఇవ్వలే..

(ఆంధ్రజ్యోతి- కోదాడ రూరల్)

కోదాడ డివిజన్‌లో నాట్లువేసి రెండునెలలు దాటినా రైతులకు సకాలంలో యూరియా అందుబాటులోకి రాలేదు. అవసరాల్లో సగం మేర కూడా పంపిణీ చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో రూ.260 ఉన్న యూరియా బస్తాను రూ.500కు విక్రయిస్తున్నారు. అయినా వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కోదాడ డివిజన్‌లో 95,987 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి వాగులు, కుంటలు, చెరువులు, బోర్లలో నీరు చేరడంతో రైతులు సాగుకు రాని భూములను కూడా సాగుచేసి కాల్వ చివరి భూముల్లో సైతం నాట్లు వేశారు. దీంతో నాట్లు వేసే సమయంలో అవసరమైన డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సమృద్ధిగా లభించినా యూరియా మాత్రం అందలేదు.

అన్నిమండలాల్లోనూ ఇదే పరిస్థితి

అనంతగిరి మండలంలో యూరియా 2,626 మెట్రిక్ టన్నులు, చిలుకూరులో 3,038 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 50శాతానికి మించి అందలేదని రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కోదాడలో 5,310 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 2,700మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని అధికారులు తెలిపారు. మోతెలో 3,400 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 1,500మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. మునగాలలో 3,530 మెట్రిక్ టన్నుల యూరియాకు 2వేల మెట్రిక్ టన్నులు వచ్చింది. నడిగూడెంలో 4,700 మెట్రిక్ టన్నుల యూరియాకు 2 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని అధికారులు తెలిపారు.

పక్క రాష్ట్రం నుంచి

అవసరమైన యూరియా సరఫరా కాకపోవడంతో సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లోని బంధువుల ద్వారా యూరియా తెప్పించుకుంటున్నట్లు రెడ్లకుంట, నల్లబండగూడెం గ్రామాల రైతులు తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవలి ప్రైవేట్ మార్కెట్‌లో యూరియా సరఫరా కావడంతో కొంతమేర డిమాండ్ తగ్గిందని రైతులు తెలిపారు. అయితే అదనంగా రైతుల నుంచి రూ.200 వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో ఆగ్రహించిన రైతులు ఇటీవల వ్యవసాయ కార్యాలయం ముందు కూడా రైతులు ఆందోళన చేశారు. యర్రవరం సహకార సంఘం నుంచి రెండు ఆటోల ద్వారా యూరియా కట్టలను అక్రమంగా తరలిస్తున్నందున రైతులు సూర్యాపేట డీసీవోకు ఫిర్యాదు చేశారు.

పుట్టినరోజున తోటి విద్యార్థులకు అల్పాహారం

మోత్కూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని యశస్విని తన జన్మదిన వేడుకల కోసం ఆడంబరాలకు పోకుండా తోటి విద్యార్థులకు శుక్రవారం అల్పాహారం అందించింది. పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఆకలితో బాధపడకుండా సాయంత్రం వేళ అల్పాహారం అందిస్తున్నారు. ఈ క్రమంలో అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మోత్కూరుకు చెందిన విద్యార్థిని యశస్విని తన జన్మదినం సందర్భంగా శుక్రవారం సాయంత్రం విద్యార్థులకు అల్పాహారం అందించారు. బాలికను హెచ్ఎం గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరవిందరాయడు, రాంప్రసాద్, ఉప్పలయ్య, అశోక్, వాలంటీర్ ప్రణతి పాల్గొన్నారు.



అల్పాహారం అందిస్తున్న విద్యార్థిని యశస్విని

రేషన్ బియ్యం పట్టివేత

డిండి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా డిండి ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా చెర్కుపల్లి గ్రామశివారులో పెట్రోలింగ్ బృందం అదుపులోకి తీసుకుందన్నారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



రేషన్ బియ్యాన్ని చూపిస్తున్న పోలీసులు

నిజాయితీ చాటుకున్న కండక్టర్

కోదాడరూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా కోదాడ ఆర్టీసీ డిపో కండక్టర్ ఎం.ప్రవీణ్‌కుమార్ తన నిజాయితీని చాటుకున్నారు. శుక్రవారం ఖమ్మం రూట్లో ఖమ్మం-నేలకొండపల్లి వరకు ప్రయాణం చేసిన ప్రయాణికురాలు రూ.లక్ష విలువైన ఐ ఫోన్, రూ.4 వేల విలువైన మరో ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న బ్యాగును బస్సులో మరిచిపోయింది. దీనిని గమనించిన కండక్టర్ ప్రవీణ్‌కుమార్ బ్యాగును కోదాడ డిపో కంట్రోలర్ వద్ద అందజేశారు. అనంతరం ప్రయాణికురాలికి సెక్యూరిటీ అధికారుల సమక్షంలో బ్యాగును డిపో సిబ్బంది అందజేసినట్లు తెలిపారు. డ్యూటీలో నిజాయితీ చాటిన కండక్టర్‌ను డిపో మేనేజర్ శ్రీనివాసరావు, డిపో సిబ్బంది అభినందించారు.



మహిళకు బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

దొరికిన సెల్‌ను అందజేసిన పేపర్ ఏజెంట్

చిలుకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దొరకిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అందజేసి పేపర్ ఏజెంట్ నిజాయితీని చాటుకున్నారు. చిలుకూరు మండల కేంద్రానికి చెందిన పేపర్ ఏజెంట్ శ్రీను శుక్రవారం తెల్లవారుజామున పేపర్ వేస్తున్న క్రమంలో బస్టాండ్ సెంటర్‌లో సెల్‌ఫోన్ దొరికింది. ఆ సెల్‌ఫోన్‌ను ఆయన పోలీసులకు అందజేశారు. పోలీసుల సహాయంతో చిలుకూరు చెందిన శివ అనే వ్యక్తిదిగా గుర్తించి అతడికి అందజేశారు. నిజాయితీ చాటుకున్న శ్రీను పోలీసులు, గ్రామస్థులు అభినందించారు.



పోలీసులకు సెల్‌ఫోన్ అందజేస్తున్న శ్రీను

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మాడ్గులపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని అభంగాపురం శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ కృష్ణయ్య శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం అభంగాపురం గ్రామ శివారులోని రైల్వే క్రాసింగ్ కింద అండర్ పాసింగ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 60 ఏళ్ల ఉంటుందని, అతడి శరీరంపై కాకి కలర్ చొక్కా, లోపల కలర్ టీషర్టు, బ్రౌన్ కలర్ ఫుల్ డ్రాయర్ ఉందని తెలిపారు. అభంగాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ బషీర్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

బీసీ రిజర్వేషన్లకు కేంద్రం ఆటంకం: జూలకంటి

మిర్యాలగూడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఆటంకం కలిగించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే బీసీ రిజర్వేషన్లకు మోకాలు అడ్డుతోందన్నారు. 42శాతం రిజర్వేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అసెంబ్లీలో చర్చకు పెట్టిందన్నారు. అన్ని రాజకీయపార్టీల ఆమోదంతోనే బిల్లును రాష్ట్రపతి, గవర్నర్‌లకు పంపిందన్నారు. అక్కడ బిల్లు ఆమోదించకుండ కావాలనే కాలయాపనకు చేస్తున్నారని ఆరోపించారు.వారి అనుమతి లభిస్తే కోర్టుకు వెళ్లే పరిస్థితి తలెత్తేది కాదన్నారు. బీసీ రిజర్వేషన్లు మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో అమలు జరుగుతున్నాయన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. రాజకీయంగా కేంద్రానికి అనుకూలంగా ఉన్నందునే జమ్ముకాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేశారని, ప్రజాప్రతినిధుల చట్టం తీసుకవచ్చారని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ కార్యదర్శి మల్లు ఉగౌతంరెడ్డి, మండల కార్యదర్శి మైడావత్ రవినాయక్, జిల్లా నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, గోవర్దన, కోటిరెడ్డి, అరుణ, నాగేందర్ , చారీ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

భూమి కోసం తండ్రిపై హత్యాయత్నం

పెన్‌పహాడ్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): భూమికోసం కుమారులు తండ్రిపై హత్యాయత్నం చేయగా, తల్లి సహకరించింది. ఈ ఘటనలో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట జిల్లా సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, పెన్‌పహాడ్ ఎస్ఐ గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేఘ్యాతండా గ్రామానికి అంగోతు కురువాకు 24 ఏళ్ల కిందట కోదాడ సమీపంలోని గోల్ తండాకు చెందిన కోటమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు పవన్ కల్యాణ్, ప్రవీణ్‌కుమార్‌లు ఉన్నారు. కోటమ్మతో కురువా నిత్యం ఘర్షణ పడుతుండేవాడు. దీంతో నాలుగేళ్లుగా వారు వేర్వేరుగా ఉంటున్నారు. కుమారులు శాంతినగర్‌లో ఉంటున్న కోటమ్మ దగ్గర ఉంటుండగా, కురువా ఒక్కడే మేఘ్యాతండాలో ఉంటున్నాడు. కురువాకు చెందిన ఆరు ఎకరాల భూమిని కుమారులకు పంచి ఇవ్వకుండా వ్యవసాయం చేసుకుంటున్నాడు. తండ్రి బతికి ఉంటే తమకు భూమి దక్కదనే భావంతో కుమారులు పవన్ కల్యాణ్, ప్రవీణ్‌కుమార్‌లు కురువా భార్య కోటమ్మతో కలిసి ఈ నెల 6న రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా కాళ్లకు తాడు కట్టి ఇనుప రాడ్డులతో దాడికి పాల్పడ్డారు. కురువాను చంపే ప్రయత్నం చేశారు. చుట్టుపక్కల వాళ్లు వస్తున్నారనే భయంతో కురువాను వారే సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో తరలించి అక్కడ నుంచి వెళ్లిపోయారు. అనంతరం కురువా ఫిర్యాదు మేరకు భార్య కోటమ్మ, కుమారులు పవన్‌కల్యాణ్, ప్రవీణ్‌కుమార్‌లపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణలు తెలిపారు. సమావేశంలో కానిస్టేబుళ్లు లింగరాజు, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపీకృష్ణ

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని యువకుడు మృతి

నకిరేకల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన శానాల విక్రమ్‌రెడ్డి(24) బీఎస్సీ(అగ్రికల్చర్) పూర్తిచేసి నకిరేకల్‌లోని మార్కెట్‌రోడ్డులో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం అదేప్రాంతానికి చెందిన స్నేహితుడు రావుల ప్రభుతో కలిసి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. నకిరేకల్ వచ్చేందుకు బైపాస్ రహదారిలో పద్మానగర్ జంక్షన్ వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిని ద్విచక్రవాహనంతో దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న ఆయిల్‌ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న విక్రమ్‌రెడ్డి చొక్కా ట్యాంకర్ ముందు భాగానికి చిక్కుకుని కొద్దిదూరం ఈడ్చుకువెళ్లింది. డ్రైవర్ బ్రేక్ వేయటంతో ముందు టైర్ ఎక్కలేదు. స్థానికులు గమనించి చూడగా, అప్పటికే విక్రమ్‌రెడ్డి మృతి చెందాడు. వెనుక కూర్చున్న ప్రభు ట్యాంకర్ ఢీకొట్టిన సమయంలో ఎగిరిపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని, తీవ్రగాయాలైన ప్రభును 108 ద్వారా నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ప్రభుకు వైద్య చికిత్స అందజేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విక్రమ్‌రెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. విక్రమ్‌రెడ్డి తండ్రి యుగేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



విక్రమ్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ట్రాక్టర్ ఆటోను ఢీకొని మహిళ

దేవరకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండలో ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధురాలు మృతి చెందింది. సీఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ముదిగొండ నుంచి దేవరకొండకు శుక్రవారం వస్తున్న ఆటోను దేవరకొండ సిల్వర్‌జూబ్లీ క్లబ్ నుంచి కల్వకుర్తి రోడ్డు వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటో పల్టీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముదిగొండ కమలాపూర్‌కు చెందిన ద్రౌపతమ్మ(52)కు తీవ్రగాయాలయ్యాయి. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందింది. విచారణ చేస్తున్నామని, ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు



బోల్తాపడిన ఆటో

ఆలేరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆటోబోల్తా పడి విద్యార్థులకు గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామ శివారులో శుక్రవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే రాజాపేట మండలం సోమారం గ్రామం నుంచి ఆటోడ్రైవర్ సహా 12మందితో ఆలేరుకు బయలుదేరింది. కొలనుపాక శివారులో బోల్తాపడింది. ఈ ఘటనలో కొలనుపాక ఉన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థులు జంగ దీపక్, తమ్మడి ప్రవళిక, గిరిరాజు సమీర, మేకల కౌశిక్, గిరిరాజు చందుకు స్వల్పగాయాలు కాగా రాగుల నవ్యకు తలకు గాయమైంది. చికిత్సకోసం జనగామ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మల్లెల సుదర్శన్, నర్సమ్మ, కర్రె ఉదయశ్రీ, ఉప్పాల సంజనలు కూడా గాయాలయ్యాయి. పాఠశాల, కళాశాలకు వెళ్లే సమయంకావడంతో రోజూ రావాల్సిన ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ఆటోలో ప్రయాణించాల్సి వచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

మినీలారీ బోల్తా, డ్రైవర్‌కు గాయాలు



హుజూర్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురం గ్రామంలో ధాన్యపు లోడు మినీలారీ బోల్తా కొట్టింది. హుజూర్‌నగర్‌కు చెందిన మినీలారీ డ్రైవర్ షేక్ మీరా అమవరంలోని రైతు ఉస్తెల సోమిరెడ్డి ధాన్యాన్ని హుజూర్‌నగర్‌కు తరలిస్తుండగా కల్వర్టు వద్ద బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ మీరా తీవ్రంగా గాయపడ్డాడు. ధాన్యంబస్తాలు నీళ్లలో పడి తడిశాయి. అటుగా వచ్చిన మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి 108 వాహనంలో డ్రైవర్‌ను ఏరియా ఆసుపత్రికి తరలించారు.

డ్రైవర్ ఆత్మహత్య



శంకర్(ఫైల్‌ఫొటో)

రామన్నపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో డ్రైవర్ శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన నల్ల శంకర్(22) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తండ్రి యాదయ్య, భార్యను తీసుకుని తమ్ముడి ఇంటికి వెళ్లాడు. శంకర్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా శంకర్ వంటగదిలో ఉరివేసుకుని కనిపించాడు. ఈ ఘటనపై యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

హైదరాబాద్‌లో వివాహిత..

హయత్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకు చెందిన వివాహిత హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నాగులపాటిఅన్నారం గ్రామానికి చెందిన గందమల్ల వసంత(40) ఆమె భర్త జయరాజ్‌తో కలిసి కొంతకాలంగా పెద్ద అంబర్‌పేట్‌లోని స్థానిక ఆస్పత్రి క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. జయరాజ్ ఆస్పత్రిలోపనిచేస్తున్నాడు. భార్య ఇంటి వద్దే ఉంటుంది. కొంతకాలంగా వసంత మానసికంగా ఇబ్బందులు పడుతోంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుంది. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. భర్త జయరాజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

మోటకొండూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం నాంచారిపేటలో శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన పైళ్ల సుధాకర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పశువులను మేతకు తీసుకెళ్లాడు. అక్కడే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలకు పాడి ఆవు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పాడి ఆవు విలువ రూ.లక్ష ఉంటుందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పిడుగుపాటుకు గేదె..

కోదాడ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామంలో పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. రైతు చిరతగండ్ల రంగాకు చెందిన గేదె సమీపంలో శుక్రవారం వర్షం కురిసిన సమీపంలో పిడుగుపడి మృతి చెందింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతు కోరాడు.

ఉపాధి హామీలో బోగస్ హాజరుకు చెక్


మఠంపల్లి మండలంలో కూలీల ఫొటోలు, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు

- కూలీల ముఖ గుర్తింపు ఫొటో విధానానికి శ్రీకారం
- ఆన్‌లైన్‌లో కూలీల వివరాలు నిక్షిప్తం చేస్తున్న అధికారులు
- నవంబరు చివరికి పూర్తి కానున్న ప్రక్రియ

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డు కట్ట వేసి.. పనుల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఉపాధి హామీ కూలీల ముఖగుర్తింపు హాజరు (ఫేస్ రికగ్నజేషన్ అటెండెన్స్) విధానానికి శ్రీకారం చుట్టింది. దీంతో కూలీలు చేస్తున్న పనులు, నగదు చెల్లింపు ప్రక్రియలో బోగస్ హాజరుకు చెక్ పడనుంది.

- (ఆంధ్రజ్యోతి-మఠంపల్లి /అడ్డగూడూరు)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందుకు ఉపాధి హామీ కూలీల ముఖగుర్తింపు హాజరు (ఫేస్ రికగ్నజేషన్ అటెండెన్స్) విధానానికి శ్రీకారం చుట్టింది. ఒకరి పేరిట మరొకరు పనులకు వెళ్లడం లాంటి వాటికి చెక్ పడనుంది. ఈ కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ఇటీవల ఉపాధి కూలీల ముఖచిత్రం, ఇతర వివరాల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. అన్ని గ్రామాల్లో క్షేత్ర సహాయకులు (ఫీల్డ్‌అసిస్టెంట్) మొబైల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూలీల ఫేస్ ఐడీ నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు సూర్యాపేట జిల్లాలో సుమారు 50శాతంపై వరకు కూలీల కార్డులకు సంబంధించి ముఖ చిత్రాల సేకరణ నమోదు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. నవంబరు చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించుకున్నారు. సూర్యాపేట జిల్లాలో మండలాలు 23, గ్రామాలు 475, జాబ్ కార్డులు 2,63,000 ఉండగా కూలీల సంఖ్య 5,60,275, పనులకు వెళ్తున్నవారు 3,34,539 మంది ఉన్నారు.

అక్రమాలు జరగకుండా...

ఉపాధి హామీ పనుల విషయంలో మృతి చెందిన వారి పేరిట జాబ్‌కార్డు ఉంటే వారి పేరు మీద కుటుంబ సభ్యులు పనులకు వెళ్లేవారు. అలాగే 100 రోజుల పని దినాలు పూర్తి చేసిన వారు, ఊర్లో లేని వారు, జాబ్‌కార్డు ఉండి పనికి రాని వాళ్ల పేరున ఇతరుల జాబ్‌కార్డుతో పని చేయడంతో అక్రమాలు చోటు చేసుకునేవి. అయితే అక్రమాలు జరగకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త విధానం తీసుకొచ్చింది. కొత్తగా తెచ్చిన ముఖగుర్తింపు హాజరు విధానంతో ఆన్‌లైన్‌లోనే హాజరు నమోదు కానుంది. ఎవరూ పనులకు వస్తే వారి పేరిట మాత్రమే హాజరు నమోదు కానుంది. ఒక జాబ్ కార్డులో నలుగురు కూలీలు ఉంటే పనికి వచ్చిన వారి పేరిట హాజరు నమోదుతో పాటు వేతనం కూడా వారి ఖాతాలోనే జమవుతోంది. చెల్లింపులు సైతం త్వరగా పూర్తవుతాయి.

పారదర్శకత కోసమే



ఉపాధి హామీ పథకం అమలులో మరింత పారదర్శకత కోసమే ప్రభుత్వం ముఖ గుర్తింపు హాజరు విదానాన్ని తెచ్చింది. అన్ని గ్రామాల్లో కూలీల ముఖ గుర్తింపు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. క్షేత్ర సహాయకులు, కొన్ని చోట్ల పంచాయతీ కార్యదర్శులు కూలీల వివరాలను నమోదు చేస్తున్నారు. బోగస్ హాజరుకు చెక్ పెట్టేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతోంది.

- వెంకటాచారి, ఎంపీడీవో, మఠంపల్లి

త్వరగా పూర్తయ్యేలా చర్యలు

ఉపాధిహామీ కూలీల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. సాధ్యమైనంత త్వరగా నమోదు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించాం.అడ్డగూడూరు మండలంలో మొత్తం 7,289 కూలీలు ఉండగా ఇప్పటివరకు 4,538 మందికి ఈ -కేవైసీ పూర్తి చేశారు.

- రవీందర్ , ఏపీవో అడ్డగూడూరు

రెండు ఫొటోలు ఉంటేనే కూలీ డబ్బులు

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో ఈనెల 1వతేదీ నుంచి ఈ-ఎంబీ, ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ చేపట్టారు. పనిచేసే ప్రాంతాల వివరాలను ముందుగా కొలత పుస్తకం, తర్వాత ఆన్‌లైన్‌లో, ఈ-ఎంబీలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలను ప్రత్యేక యాప్‌తో అనుసంధానిస్తే పనులను ఎప్పుడైనా చూసుకోవచ్చు. దీంతో ఒకే చో రెండు పనులు చేయడం వంటి తప్పిదాలకు అస్కారం ఉం డదు. పని ప్రదేశం వద్ద కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. కానీ కొందరు క్షేత్ర సహాయకులు, మేట్లు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నట్లు గుర్తించారు. సామాజిక తనిఖీల్లో అక్రమాలు బయటపడుతుండటంతో వీటిని అరికట్టేందుకు కేంద్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌ను తీసుకువచ్చింది. దీనిని కూడా దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించింది. దీని ప్రకారం పనులకు వచ్చిన కూలీల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకే వ్యక్తి రెండు ఫొటోల్లో ఉంటేనే కూలి డబ్బులు అందుతాయి.

వేమన యూనివర్సిటీ వీసీగా హుజూర్‌నగర్ వాసి


బెల్లంకొండ రాజశేఖర్

హుజూర్‌నగర్ , అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన బెల్లంకొండ రాజశేఖర్‌కు అరుదైన అవకాశం లభించింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బెల్లకొండ రాజశేఖర్ రెండురోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కడప జిల్లాలోని యోగి వేమన యూనివర్సిటీకి వైస్‌ఛాన్సలర్‌గా ని యమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండురోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సివిల్ ఇంజనీర్ బీటెక్ చేసిన ఆయన నాలుగు వేర్వేరు విషయాల్లో మాస్టర్ డిగ్రీలు పొందారు. రాష్ట్ర ప్రభుత్వం అసోసియేషన్‌లో భాగస్వామిగా టీ ఎస్‌పీఎస్‌సీలో పరీక్షా విధానాలు, నిర్వహించడంలో ఆయన కీలక బాధ్యతలు నిర్వహించారు. గతంలో సెంట్రల్ యూనివర్సిటీ డీన్‌గా, రిజిస్ట్రార్‌గా, డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేశారు రాజశేఖర్ వీసీగా నియామకం కావడంపై లింగగిరి గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

యాదగిరీశుడికి వైభవంగా సువర్ణ పుష్పార్చన


ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి శుక్రవారం సువర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాతసేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం అమ్మవారిసేవను తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మం డపం ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నిరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధి రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీ హోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 29,50,067 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు.

పరిపాలన బాధ్యత నిర్వహణలో విఫలం

- మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్‌కు షోకాజ్
- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం


మైనార్టీ రెసిడెన్షియల్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీలో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. కలెక్టర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో ప్రిన్సిపాల్ భోజనం కోసం బయటకు వెళ్లినట్లు గుర్తించారు. నిబంధనల మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ వసతిగృహంలోనే భోజనం చేయాలనే నిబంధన ఉన్నా ఉల్లంఘించారు. అదేవిధంగా పాఠశాల భవనం, ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, పారిశుధ్య నిర్వహణకు సరైన చర్యలు చేపట్టకపోవడంతో ప్రధాన పరిపాలన బాధ్యతలను నిర్వహించడంలో ప్రిన్సిపాల్ విఫలమైనట్లు కలెక్టర్ గుర్తించారు. అదేవిధంగా కొందరు ఉపాధ్యాయులు కూడా పాఠశాల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా గైర్హాజరయ్యారు. ఈ లోపాలన్నింటికీ ప్రిన్సిపాల్ విధుల్లో తీవ్రమైన అలసత్వం, పర్యవేక్షణ లోపం, క్రమశిక్షణ రాహిత్యాన్ని చూపిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ అనుసరించిన విధానాలు ప్రభుత్వ నియంత్రణలో నడిచే సంస్థలకు ఆమోద యోగ్యం కాకపోవడంతో ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. మూడు రోజుల్లో సరైన వివరణ ఇవ్వకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి


లింగమ్మ (ఫైల్)

తిరుమలగిరి, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు బండారు కృష్ణమూర్తి భార్య లింగమ్మ (102) శుక్రవారం మృతి చెందారు. అనారోగ్య కారణాలతో హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ అక్కడ ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆమె ఎన్నో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిం చిందని పలువురు నాయకులు గుర్తుచేసుకున్నారు. ఆమె మృతికి పాలెపు చంద్రశేఖర్, దీన్‌దయాళ్, ఓం ప్రకాష్, బండారు దయాకర్ తదితరులు సంతాపం తెలిపారు.

చేనేత కార్మికులకు రుణమాఫీ చేయాలి


మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, శాంతికుమార్

మోత్కూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నందున వెంటనే రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ కోరారు కార్మికుల, చేనేత సంఘాల క్యాష్, క్రెడిట్ రుణాలు మాఫీ చేయాలని, చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, చేనేత భరోసా పథకం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం వారు హైదరాబాద్‌లో చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కమిషనర్ శైలజారామయ్యర్‌కు వినతి పత్రాలు అందజేశారు. త్వరలోనే చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ ఇచ్చారని వారు తెలిపారు. కమిషనర్ తమతో పలు విషయాలపై చర్చించారన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే కార్మికుల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ జమ చేస్తామని, త్రిఫ్ట్ ఫండ్‌కు కూడా ప్రభుత్వం రూ.7 కోట్లు విడుదల చేయాల్సి ఉందని, ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే జమ చేస్తామన్నారని వారు చెప్పారు. సబ్సిడీ నూలు స్థానంలో తీసుకొచ్చిన చేనేత భరోసా పథకంలో జియో ట్యాగింగ్ ఉన్న చేనేత కార్మికులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చి వారి ఫోటోలు అప్‌లోడ్ చేయాలని చెప్పారన్నారు. వారి వెంట కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి ముశం నరహరి, వర్కాల చంద్రశేఖర్‌పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

నల్లగొండస్పోర్ట్స్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని ప్రైవేట్ జిమ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్ 14, 17 బాల, బాలిక వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు జరిగాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దగ్గుపాటి విమల ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల నుంచి 30 మంది బాలబాలికల హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రిఫరీలు విజేతలుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13నుంచి ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడలు

నల్లగొండ స్పోర్ట్స్ : జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 13వతేదీ నుంచి ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ డి.విమల తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 13న అండర్-14, 17 బాల, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, 14న అండర్- 14, 17 బాలికలకు ఖోఖో, అథ్లెటిక్స్ 15న అండర్-14,17 బాలురకు ఖోఖో, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో జిల్లా స్థాయి టోర్నమెంట్, క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ కన్వీనర్లు, కోచ్‌లు, టీమ్ తో పాటు క్రీడాకారుల బోనఫైడ్‌లతో ఈ నెల 13వ తేదీన ఉదయం 9 గంటలకు మేకల అభినవ్ స్టేడియానికి హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9948987026 నెంబరును సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

మునుగోడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మహాత్మాజ్యోతిబాపులే (ఎంజేపీ) బాలికల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తేజశ్రీ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తేజశ్రీని ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మల్ల ఖంభం ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక


క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో విద్యార్థుల విన్యాసాలు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రీనిటీ విద్యాసంస్థల ప్లే గ్రౌండ్‌లో శుక్రవారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణకు మల్లఖంభం (మల్కంబ్) ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్లను ఎంపిక చేశారు. అండర్ 14 ,17, 19 విభాగాలకు ఒక్కొక్క జట్టుకు 12 మంది క్రీడాకారులు (విద్యార్థులు) ఎంపికయ్యారు. మూడు జట్లకు ఎంపికైన వారంతా ట్రినిటీ విద్యాసంస్థలకు చెందిన క్రీడాకారులు కావడం విశేషం. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లు రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలలో పాల్గొంటాయి. ఈ జట్ల ఎంపికలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కే.దశరథ రెడ్డి, మండల కార్యదర్శి కే.లింగయ్య, ట్రీనిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో కక్షిదారుల పరస్పర దాడి

- యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఘటన


యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి కోర్టులో ఘర్షణ పడుతున్న కక్షిదారులు

భువనగిరిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ రీకాల్‌కు వచ్చిన కక్షిదారులు యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం పరస్పరం దాడి చేసుకున్నారు. బాధితుడు నర్సింగ్‌రావు తరుపున న్యాయవాది సురేష్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ఇసుక నర్సింగ్‌రావు తన కుమార్తెను వైద్య విద్య చదివించేందుకు హైదరాబాద్‌లోని ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో అడ్మిషన్ కోసం జనగామకు చెందిన కొత్తపల్లి సతీష్‌కుమార్(కన్సల్టెన్సీ)కు ఐదేళ్ల క్రితం రూ.75లక్షలకు పైగా నగదు ఇచ్చాడు. సతీష్‌కుమార్ హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో నివాసం ఉంటున్నాడు. గతంలో జనగామ ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. నర్సింగ్‌రావు కుమార్తెకు వైద్యవిద్య చదివేందుకు ప్రవేశం దక్కినా, సతీష్‌కుమార్‌కు ఇచ్చిన నగదులో కొంత మొత్తమే వైద్య కళాశాలలో చెల్లించాడు. తాను ఇచ్చిన మొత్తం నగదు కళాశాలలో చెల్లించక పోవడంతో, మిగతా సొమ్ము ఇవ్వాలంటూ సతీష్‌కుమార్‌పై నర్సింగ్ రావు ఒత్తిడితెచ్చాడు. దీంతో సతీష్‌కుమార్ రూ.20లక్షల విలువైన చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కు చెల్లుబాటు కాకపోవడంతో నర్సింగ్ రావు భువనగిరి కోర్టులో చెక్ బౌన్స్ కేసువేశాడు. సతీష్‌కుమార్ కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో వారెంట్ రీకాల్ కోసం శుక్రవారం సతీష్‌కుమార్ కోర్టుకు రాగా అదే సమయంలో వచ్చిన నర్సింగ్‌రావు మధ్య వాగ్వావాదం జరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనతో కోర్టు ఆవరణలో ఉద్రిక్తత నెలకొంది. అక్కడే ఉన్న న్యాయవాదులు, ఇతరులు ఇద్దరికీ సర్దిచెప్పడంతో వివాదం సద్దు మణిగింది.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.40,46,640

నార్కట్‌పల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్న నగదు 85 రోజులకు గాను మొత్తం రూ.40,46,640లు లభించినట్లు ఈవో సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. గుట్టపైన హుండీలను తెరిచి లెక్కించగా రూ.34,07,100, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయం హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.6,39,540, అదేవిధంగా దేవస్థాన నిత్యాన్నదాన సత్రంలోని హుండీ ద్వారా రూ.50,844 లభించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ భాస్కర్, పరిశీలకురాలు సుమతి, దేవస్థానం సిబ్బందితో పాటు నందిగామకు చెందిన శ్రీ దుర్గ శివసాయి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

4 గేట్ల నుంచి దిగువకు సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు నాలుగు క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, శుక్రవారం సాయంత్రానికి 590అడుగులు(312.0450టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,272 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,536 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600 క్యూసెక్కులు, నాలుగు గేట్ల నుంచి 32,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి మొత్తం 83,848 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి అంతే మొత్తంలో వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది.

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 5838.15 క్యూసెక్కులుగా నమోదైంది. 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు శుక్రవారం సాయంత్రానికి నీటిమట్టం 644.28 అడుగులు(4.27టీఎంసీలు)గా ఉంది. దీంతో గేట్లతో పాటు కుడి, ఎడమ కాల్వల ద్వారా మొత్తం 6826.79 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నోటీసులిచ్చినా బేఖాతర్


శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం

- చెర్వుగట్టు ఆలయానికి బకాయిల భారం
- రూ. 1.10 కోట్లు చెల్లించని టెండర్‌దారులు

నార్కట్‌పల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టులో గల శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి టెండర్ బకాయిలు పేరుకుపోతున్నాయి. 2022-23 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు వివిధ టెండర్ల ద్వారా దేవస్థానానికి రావాల్సిన బకాయిలు సుమారు రూ.1.10 కోట్లకు చేరాయి. పేరుకుపోతున్న టెండర్ బకాయిల వసూలు కోసం దేవస్థానం అధికారులు సంబంధిత టెండర్‌దారులకు నోటీసులు జారీ చేసినా రాజకీయ అండదండలతో పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. మరికొందరు టెండర్‌దారులు దేవస్థానం పంపిన నోటీసులను ఖాతరు చేయకుండా దేవస్థానంపైనే కోర్టుకెక్కారు. దీనికి తోడు ఆలయ పాలనా వ్యవహారాల్లో రాజకీయ జోక్యం వెరసి చెర్వుగట్టు ఆలయ ఆదాయానికి గండి పడుతోందన్న విమర్శలు వినవస్తున్నాయి. దీంతో టెండర్ల నిర్వహణ, బకాయిల వసూళ్లలో దేవస్థానం సిబ్బంది పరిస్థితి అడకత్తెరలో పోకలా మారి విమర్శలకు తావిస్తోంది.

టెండర్లతోనే సింహభాగం ఆదాయం

దేవస్థాన వార్షిక ఆదాయంలో సింహభాగం టెండర్ల నిర్వహణ ద్వారానే సమకూరుతోంది. ప్రధానంగా తలనీలాల సేకరణ, కొబ్బరి చిప్పల సేకరణ, శేషవస్త్రాల సేకరణ, కొబ్బరికాయల విక్రయం, ఘాట్‌రోడ్డుపై టోల్‌గేట్ నిర్వహణ, దేవస్థానానికి చెందిన వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల అద్దెలు, ఒడి బియ్యం సేకరణ, గొర్రెలు,మేకపోతుల సేకరణ, హోటల్ నిర్వహణ, గుట్ట పై కిరాణం షాపు, కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహణ, వాహన పూజలకు బొట్టుపెట్టడం, పూలదండల విక్రయాల్లో, టాయ్‌లెట్ బ్లాక్‌ల నిర్వహణ వంటి ఎల్-1 కేటగిరీలకు ఏడాది కాలపరిమితి కింద బహిరంగ టెండర్లు నిర్వహించడం ద్వారా దేవస్థానానికి ఆదాయం సమకూరుతోంది. వీటిలో ముఖ్యంగా తలనీలాల సేకరణ, కొబ్బరికాయల విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, ఘాట్‌రోడ్డు నిర్వహణతోనే దేవస్థానానికి అధిక ఆదాయం సమకూరుతోంది.

డిఫాల్టర్లకు వేలం అవకాశం?

దేవస్థానం నిర్వహించే వేలం నిబంధనల ప్రకారం ఓ పర్యాయం డిఫాల్టర్‌గా గుర్తించిన టెండర్‌దారునికి మళ్లీ టెండర్లలో పాల్గొనే అర్హత ఉండదు. కానీ కొన్ని ఎల్-1 టెండర్లకు సంబంధించి డిఫాల్టర్లు టెండర్‌లో పాల్గొని మళ్లీ దక్కించుకోవడం విమర్శలకు తావిస్తుంది. గుట్టకింద పార్వతీ అమ్మవారి ఆలయం వద్ద ఓ షాపునకు టెండర్‌దారుడు రూ.21.50 లక్షలు పాడి ఆలయ పాలన వ్యవహారాల్లోని కొన్ని లోపాలను సాకులుగా చూపి కేవలం రూ. 5 లక్షలు మాత్రమే చెల్లించి మిగతా రూ.16.50 లక్షలను చెల్లించలేదు. అయినా సదరు టెండర్‌దారుడు మరో వ్యక్తిపేరిట షాపు టెండర్ దక్కించుకోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి కొబ్బరికాయల విక్రయ వేలం హక్కుకు సంబంధించి వేలం నిర్వహించగా రూ.75,55,555లు పలికింది. అయితే వేలం నిబంధనల ప్రకారం వేలం మొత్తాన్ని 72 గంటల్లో టెండర్ దారుడు చెల్లించాల్సి ఉంది. కానీ నేటికీ ఇంకా రూ.15.50 లక్షలు చెల్లించాల్సి ఉంది.

బకాయిదారులకు నోటీసులు



దేవస్థానంలో వివిధ టెండర్లు దక్కించుకుని కాలపరిమితి ముగిసినా పలు సాకులు చెప్పి బకాయి పడిన టెండర్‌దారులకు నోటీసులు అందజేశాం. కొందరు టెండర్‌దారులు బకాయిల నోటీసులపై కోర్టు కెళ్లారు. మరి కొన్ని టెండర్ల బకాయిలకు సంబంధించి దేవస్థానం తరపున కోర్టులో కేసులు కూడా వేశాం. ప్రస్తుతం అవి పెండింగ్‌లో ఉన్నాయి. టెండర్ బకాయిల్లో కొన్ని టెండర్లను మధ్యలోనే ఆపివేసి మళ్లీ టెండర్లు నిర్వహించాం. కాకపోతే టెండర్ రికార్డుల నిర్వహణలో మాత్రం అవి బకాయిలుగానే మిగిలిపోతాయి. కమిషనర్ ఆమోదం తీసుకుని వాటిని క్లియర్ చేయాల్సి ఉంటుంది.

- సిరికొండ నవీన్‌కుమార్, ఈవో

ఇవీ టెండర్ బకాయిలు

దేవస్థానం రికార్డుల ప్రకారం 2022 నుంచి 2025 ఆర్థిక సంవత్సరం వరకు ఆయా టెండర్ల బకాయిల వివరాలిలా ఉన్నాయి. వీటిలో కొబ్బరికాయల విక్రయానికి సంబంధించి రూ.37.30 లక్షలు, కిరాణం షాపునకు సంబంధించి రూ.1.70 లక్షలు, గుట్టకింద అమ్మవారి ఆలయం వద్ద ఉన్న షాపుల అద్దె వేలానికి సంబంధించి సుమారు రూ.20.27 లక్షలు రావాల్సి ఉంది. వీటిలో గుట్ట కింద ఉన్న ఓ షాపునకు సంబంధించినవే రూ. 16.50 లక్షలు బకాయిలు ఉండటం గమనార్హం. అదేవిధంగా హోటల్ నిర్వహణకు సంబంధించి రూ.5.18 లక్షలు రావాల్సి ఉంది. కొబ్బరి చిప్పల సేకరణకు సంబంధించి రూ.26.20 లక్షలు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇక ఘాట్‌రోడ్డుపై టోల్‌గేట్ నిర్వహణకు సంబంధించి రూ.14.12 లక్షలు రావాల్సి ఉంది. ఇత్తడి గంటల సేకరణకు సంబంధించి రూ.36 వేలు, నంది సర్కిల్ వద్ద షాపుల నిర్వహణకు సంబంధించి రూ.75వేలు, టాయ్‌లెట్ బ్లాక్‌ల నిర్వహణకు సంబంధించి రూ.4.60 లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. అదేవిధంగా గుట్టపై కూల్ డ్రింక్స్ షాపునకు సంబంధించి రూ.4.30 లక్షలు బకాయిలు ఉన్నాయి. భక్తులు స్వామివారికి సమర్పించే శేషవస్త్రాల సేకరణకు సంబంధించి రూ.1.02 లక్షలు, క్యారీ బ్యాగుల విక్రయ టెండర్‌కు సంబంధించి రూ.1.21 లక్షలు ఉన్నాయి. కాగా స్వామివారికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించుకునే గొర్రెలు, మేకల సేకరణ వేలానికి సంబంధించి రూ.4.65 లక్షలు ఉన్నట్లు టెండర్ నిర్వహణ రికార్డులు చెబుతున్నాయి.

సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలి : కుమ్మర సంఘం

నాంపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కనగల్ మండలం దర్వేశిపురంలోని సదాశివ ఫంక్షన్‌హాల్‌లో 14వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం సర్వ సభ్య సమావేశానికి అందరూ హాజరుకావాలని సంఘం మండల కన్వీనర్ తిరుమణి శేఖర్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని కుమ్మరసంఘం నాయకులు, కుమ్మరులు అధిక సంఖ్యలో సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కుల సంఘం అభివృద్ధికి పాటుపడాలని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

మునుగోడురూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మునుగోడు సబ్‌స్టేషన్‌లోని చీకటి మామిడి ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మండలంలోని చీకటిమామిడి, పలివెల, ఊకొండి సబ్‌స్టేషన్ పరిధిలోని చీకటిమామిడి, కొంపల్లి, చల్మడ, చొల్లేడు, కల్లకుంట్ల, కోతులారం, పలివెల, కిష్టాపురం, ఇప్పర్తి, కచలాపురం, ఊకొండి, సింగారం, రత్తిపల్లి గ్రామాలకు ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నరేందర్ రెడ్డి తెలిపారు.

కీలక పోస్టుల ఖాళీతో అదనపు భారం

● శాలిగౌరారం మండలంలో పరిస్థితి ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయం, ఖాళీగా ఉన్న ఎంపీవో కుర్చీ

శాలిగౌరారం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉన్న సిబ్బంది పై అదనపు భారం పడుతుంది. నెలల తరబడి కీలక పోస్టులైన సూపరింటెండెంట్, ఎంపీవో, మిషన్ భగీరథ ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నా సంబంధిత జిల్లా అధికారులు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా చాలా కాలం పనిచేసిన గాదరి సుందరయ్య ఈ ఏడాది జూన్ 30న పదవి విరమణ పొందారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఎంపీవో వెంకటేశ్వర్లు ఆగస్టు నెలలో డిప్యూటేషన్‌పై త్రిపురారం మండలానికి వెళ్లారు. దీంతో ఎంపీవో పోస్టు కూడా ఖాళీగా ఉంది. మండల మిషన్‌భగీరథ ఏఈ గంజి రాంబాబు ఈ ఏడాది మార్చి నెలలో సస్పెండ్ అయ్యారు. సూపరింటెండెంట్, ఎంపీవో, మిషన్ భగీరథ ఏఈ పోస్టులు ఈ కార్యాలయానికి కీలక పోస్టులు. నెలల తరబడి ఖాళీగా ఉండటం వల్ల వారు ఉండే గదులు ఖాళీ కుర్చీలతో బోసిపోయినట్లు కనిపిస్తున్నాయి. కార్యాలయంలో పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో కార్యాలయంలో ఉన్న అధికారులు, సిబ్బంది పై అదనపు భారం పడుతుంది. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధం కావడంతో ఈ కార్యాలయంలో పూర్తి స్థాయి అధికారులు, సిబ్బంది ఉండాలి. లేకపోతే ఎన్నికల నిర్వహణ, కార్యాలయ పనులకు తీవ్ర ఆటంకం కలిగే ప్రమాదం ఉండే అవకాశం ఉంటుందని పలువురు ప్రజాప్రతినిధులు అభిప్రాయ పడుతున్నారు. మండలంలో 24 గ్రామపంచాయతీల సర్పంచులు, 13 ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి సిబ్బంది అవసరం ఉంటుంది. ఎన్నికలు సజావుగా జరగాలంటే ఖాళీగా ఉన్న పోస్టులను తప్పనిసరిగా వెంటనే భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

అదనపు భారం పడుతుంది



తమ కార్యాలయంలో సూపరింటెండెంట్, ఎంపీవోతో పాటు మిషన్ భగీరథ ఏఈ పోస్ట్ కూడా ఖాళీగా ఉంది. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతుంది. ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను జిల్లా అధికారులకు నివేదించాం. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నందున జిల్లా అధికారులు ఖాళీ పోస్టులను భర్తీ చేస్తారని ఆశిస్తున్నాను.

- గార్లపాటి జ్యోతి లక్ష్మి, ఎంపీడీవో, శాలిగౌరారం

కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి

● ఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

నల్లగొండ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా ను జయప్రదం చేయాలని ఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో ఆ యన మాట్లాడారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి ఘటనపై సమగ్రమైన విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. దాని వెనుక ఉన్న శక్తులు గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. అంతేకాకుండా జిల్లావ్యాప్తంగా అక్టోబరు 17న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా, అక్టోబరు 22న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెస్పీ జిల్లా అ ధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, మేడి శంకర్ మాదిగ, యాదయ్య, దేవయ్య సుదర్శన్ పాల్గొన్నారు.

పత్తికి ఆకుమాడు, ఎండు తెగులు



నాంపల్లి: చిట్టెంపహడ్‌లో పత్తి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నాంపల్లి, మర్రిగూడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలంలోని చిట్టెంపహడ్, దామెర గ్రామాలలోని పత్తి, వరి పంటలను మునుగోడు సహాయ వ్యవసాయ సంచాలకుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో కేవీకే కంపాసాగర్ శాస్త్రవేత్తలు వ్యవసాయశాఖ అ ధికారులతో కలిసి పంటలను పరిశీలించారు. పత్తి పంటకు ఆకుపచ్చ రోగం, పొగాకు లద్దె పురుగు, ఆకుమాడు తెగులు, ఎండు తెగులును గుర్తించినట్లు వారు తెలిపారు. పత్తి రైతులు వర్షాలు కురవడం ఆగిన తర్వాత సిలింద్రనాసిని మందులను సూచించిన మోతాదులో పిచికారీ చేసుకోవాలని సూచించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. వరి, పత్తి పంట రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంటలను పరిశీలించిన వారిలో శాస్త్రవేత్త డాక్టర్ లింగయ్య, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ దివ్యరాణి, ఏవో బండారు శివ, వ్యవసాయ విస్తరణ అధికారులు సాయికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఈఎల్‌వీ ఫౌండేషన్

గట్టుప్పల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చదువుల్లో రాణిస్తూ, చదువుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద విద్యార్థులకు ఈఎల్‌వీ బాస్కర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని ఆ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ అన్నారు. మండలపరిధిలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన భీమనపల్లి యాదయ్య కుమార్తె కావ్య నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎంబీబీఎస్‌లో జాయిన్ కాలేదు. విషయం తెలుసుకున్న ఈఎల్‌వీ బాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఈఎల్‌వీ బాస్కర్ దృష్టికి తీసుకెళ్లడంతో రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఆ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ అందజేశారు. అదే విధంగా కావ్య ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు ఈఎల్‌వీ బాస్కర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న ఉర్సు

● రెండోరోజూ ధార్మిక కార్యక్రమాలు ● భక్తులకు నిరంతరాయంగా అన్నదానం

నల్లగొండకల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లోని చారిత్రాత్మకమైన హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్గాను దర్శించుకొని ప్రార్థనలు చేశారు. పాత కలెక్టరేట్ మదీన మసీదులో ప్రత్యేకంగా దైవ ప్రార్థనలు చేసి లతీఫుల్లా అందించిన ధర్మమార్గాలను ప్రముఖులు వివరించారు. అనంతరం సామూహికంగా ఖురాన్ పఠనం చేశారు. దర్గాపైన ప్రత్యేకంగా ముతవల్లులు దీపారాధన, ప్రార్థనలు సంప్రదాయంగా నిర్వహించారు. దర్గాకు హాజరైన భక్తులందరికీ ఉర్సు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిరాంతరాయంగా అన్నదానం చేశారు. గుట్టమెట్ల వద్ద వెలిసిన వివిధ రకాల దుకాణాల్లో భక్తులు కిటకిటలాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు దర్గాను దర్శించుకొని పార్థనలు చేశారు. దర్గా ప్రాంతమంతా భక్తులతో సందడిగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తెల్లవారుజామునుంచే దర్గాకు చేరుకుని లతీఫుల్లాకు ఫాయితాలు ఇచ్చి సాయంత్రం వరకు గడిపారు. ముస్లింల కంటే హిందువులే ఎక్కువ సం ఖ్యలో ఉర్సు ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముతవల్లులు సమీల్లాఖాద్రి, జమాల్‌ఖాద్రి, సల్మాన్‌ఖాద్రి, ఉబైద్ ఖాద్రి, గౌస్ మోహినుద్దీన్, ఇంతియాజ్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఖవ్వాలి నిర్వహిస్తున్న ముస్లింలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ముస్లింలు

'కస్తూరి' సహకారం అభినందనీయం

కట్టంగూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి కస్తూరి ఫౌండేషన్ చూపిస్తున్న చొరవ అభినందనీయమని మండలంలోని ఎరసానిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం చింత యాదగిరి అన్నారు. మండలంలోని ఎరసానిగూడెం పాఠశాలకు శుక్రవారం రూ.25వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్, విద్యార్థులకు, జాతీయ నాయకుల చిత్రపటాలను కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎంతో ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును మార్చండి

● అధికారులకు డీపీవో ఆదేశం



తిప్పర్తి వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న డీపీవో వెంకయ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిప్పర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తిప్పర్తి మండల కేంద్రంలోని వైకుంఠధామంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా చెత్తను పడవేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 8వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో "వైకుంఠధామంలో డంపింగ్" అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. కథనానికి స్పందించిన జిల్లా అధికారులు సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. శుక్రవారం డీపీవో వెంకయ్య, ఎంపీడీవో సుధాకర్‌తో కలిసి వైకుంఠధామంలో ఉన్న డంపింగ్‌యార్డును పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న ఆ ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన మరోచోట స్థలాన్ని సేకరించి వెంటనే డంపింగ్ యార్డును మార్చాలని ఎంపీడీవోను ఆదేశించారు. స్థల సేకరణ చేసిన వెంటనే డంపింగ్ యార్డును మార్చించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో జానయ్య, తిప్పర్తి పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

బడుగుల నోటికాడి ముద్దను లాక్కున్నారు

● బీసీ సంఘాల ఐక్య వేదిక ధ్వజం



నల్లగొండలో నిరసన ర్యాలీ చేపడుతున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన తర్వాత హైకోర్టు స్టేతో బడుగు, బలహీన వర్గాల నోటికాడి ముద్దను లాక్కుకున్నట్లుగా అయిందని బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకుడు నేలపట్ల సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో పూలే విగ్రహం వద్ద శుక్రవారం బీసీ సంఘాల ఐక్యవేదిక ఆ ధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ స్థా నిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు కాకుండా కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. 80శాతం జనాభా ఉన్న బీసీ కులాలకు రావాల్సిన రాజకీయ వాటాను 78 సంవత్సరాల నుంచి అనుభవిస్తూ దేశ సంపదను స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని విమర్శించారు. సామాజిక, అసమానతలను సృష్టిస్తున్న అధిపత్య కులాలు బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్‌ను జీర్ణించుకోలేక హైకోర్టు, సుప్రీం కోర్టులో కేసులో వేశాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు కేశబోయిన శంకర్, నల్లసోమ మల్లన్న, దుడుకు లక్ష్మీనారాయణ, చొల్లేటి ప్రభాకర్, వైద్యుల సత్యనారాయణ, చిక్కుళ్ల రాములు, సాయిబాబా, విజయ్ కుమార్, ఆదినారాయణ, వెంకన్న, యాదగిరి, సీతారాములు, బిక్షమయ్య, వెంకటేశ్వర్లు, ఇంద్రయ్య, సతీష్, ప్రసన్న, జనార్ధన్‌గౌడ్, మధు, చంద్రశేఖర్, మాధవి, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

బీసీ యువజన సంఘంతో పాటు పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో జీవో నెంబర్ 9ని గవర్నర్‌తో ఆమోదింపజేసి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడితే ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల జీవోకు న్యాయపరమైన అవరోధాలు తలెత్తి ఉండే వి కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు బోళ్ల నాగరాజు, శివకుమార్, రవి, సా యి, రవి వర్మ, శంకర్, రమేష్, వెంకటేష్, మురళి, లింగస్వామి, విజయ్‌కుమార్, పాండు పాల్గొన్నారు.

మునుగోడు: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించటం వల్ల బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు బూడిద లింగయ్యయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడులో బీసీ సంక్షేమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించిన నేతలు రిజర్వేషన్లు వ్యతిరేకంగా వ్యవహరించిన నేతల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్‌యాదవ్, యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి, నాయకులు తోట నర్సింహాచారి, ఈదులకంటి కైలాసం, మిర్యాల వెంకన్న, డోల్ దెబ్బ నాయకుడు మాల్గా యాదయ్య, నాగరాజు, జిట్టగోని యాదగిరి, నేరటి మల్లేష్, లక్ష్మణ్‌యాదవ్, ముత్యాలు, సైదులు, బీసం కృష్ణ పాల్గొన్నారు.

శాలిగౌరారం: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం బాధాకరమని బీసీ సంఘం శాలిగౌరారం మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ అన్నారు. శాలిగౌరారంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 9ని తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోపై కొంతమంది రిజర్వేషన్లు వ్యతిరేకులైన రెడ్డి జాగృతి సంస్థకు సంబంధించిన అగ్రవర్ణాలు అడ్డుకోవడం బాధాకరమన్నారు.

సిండికేట్లపై ఎక్సైజ్ శాఖ నిఘా

(5వ పేజీ తరువాయి)

చేసుకోవాలని వ్యాపారులకు ఎక్సైజ్‌శాఖ విజ్ఞప్తి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం విధానానికి అనుగుణంగా జిల్లాలో మొత్తం 154 రిటైల్ మద్యం దుకాణాలకు అధికారులు దరఖాస్తులు తీసుకుంటున్నారు. కొత్త దుకాణాల లైసెన్స్ కాలం ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి, 2027 నవంబరు 30 వరకు కొనసాగనుంది. జిల్లాలో 154 దుకాణాల్లో ఎస్టీ వర్గానికి నాలుగు, ఎస్సీ వర్గానికి 14, గౌడ సామాజికవర్గానికి 34 కేటాయించారు. ప్రతీ దరఖాస్తుకు రూ.3లక్షలు (నాన్ రిఫండబుల్ ఫీజు) డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చలాన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులను ఒత్తిడితో పాటు ప్రలోభాలు గురిచేస్తున్న నేపథ్యంలో వారు ఎలాంటి భయానికి గురికాకుండా దరఖాస్తు చేయాలని ఎక్సైజ్‌శాఖ అధికారులు కోరుతున్నారు. ఈనెల 18 చివరి రోజు వరకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు పెద్ద సంఖ్యలో తీసుకునేలా ఎక్సైజ్‌శాఖ ప్రణాళిక రూపొందించింది. సెలవు రోజు మినహా ఎనిమిది రోజులు గడువు ఉన్నందున దరఖాస్తులు ఏ మేరకు పెరుగుతాయనేది వేచి చూడాల్సిందే.

దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు

దరఖాస్తుల సంఖ్య రానున్న రోజుల్లో భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. మంచి రోజులను దృష్టిలో ఉంచుకొని కొంతమంది దరఖాస్తు సమర్పించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మద్యం దుకాణాలకు నిర్భయంగా దరఖాస్తు చేసుకోవాలి. ఎవరైనా సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు రాకుండా చేస్తే ఆ దుకాణాలను రీనోటిఫై చేసి సంబంధిత వ్యక్తులపై చట్టపర చర్యలు తీసుకుంటాం. ఈనెల 18 వరకు దరఖాస్తులకు గడువు ఉంది. ప్రభుత్వ ఆదాయానికి గండి పెట్టేలా దరఖాస్తుదారులను అడ్డుకుంటే ఉపేక్షించేది లేదు.

- సంతోష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

సమతుల ఆహారంతోనే రక్తహీనత నివారణ

మర్రిగూడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సమతుల ఆహారంతోనే రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద అన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో శుక్రవారం పోషకాహారంపై విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలు రక్తహీనతకు గురికాకుండా ఉండాలంటే పోషకాహారం తప్పక తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని, అదేవిధంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయినులు శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి పాల్గొన్నారు.

యోగాసనాలతో ఏకాగ్రత

చిట్యాలరూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): యోగాసనాలతో ఏకాగ్రత పెరుగుతుందని యోగా గురువు మాదగాని శంకరయ్య అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం విద్యార్థులకు యోగా శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల వయసులోనే యోగాసనాలను అలవరచుకుంటే వారిలో సంకల్ప బలం పెరగడమే కాకుండా ఆరోగ్యం మెరుగవుతుందని అన్నారు. యోగాతో శారీరక ఒత్తిడిని తగ్గించుకొని మానసిక బలాన్ని సమతుల్యతను సాధించేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం యోగాగురువు శంకరయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం పెరుమాళ్ల ఆనంద్, ఉపాధ్యాయులు పి.చంద్రయ్య, హనీష్ ఫాతిమా, ఎ.నర్సింహ, పెంటయ్య, విద్యార్థులు సిరిపంగి జ్ఞానేశ్వరి, రాచకొండ ప్రణవి, కొమ్ము అనూష, బూరుగు పూజిత, శ్రావణి, హరిదీప్, శివకుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చట్టం వల్లే బీసీలకు ఇబ్బందులు

మర్రిగూడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లు 50శాతం మించకుండా పరిమితి విధిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో చేసిన చట్టమే బీసీలకు ఉరితాడైందని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు మేతరి యాదయ్య అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో బూటకమని బీఆర్ఎస్, బీజేపీ నేతలు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లుకు గవర్నర్, రాష్ట్రపతులతో ఆమోదం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరామదాస్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిరణ్, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, లింగారెడ్డి, గ్యార వెంకటేష్, రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరూ చదవాలి

● మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండరూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 నుంచి 38వ తేదీ వరకు ప్రతీ ఒక్కరూ చదవాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన యూటీఎఫ్ నాయకుడు నాగటి నారాయణ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యలో అంతరాలు పెరిగిపోయాయి, అని ప్రభుత్వ పాఠశాలలు సమాజానికి క్రమ, క్రమంగా దూరమవుతున్నాయని, ప్రభుత్వ విద్యతోనే అందరికీ సమానమైన, నాణ్యతమైన విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన నారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. నర్ర శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎడ్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలపై నిర్లక్ష్యం తగదు

కట్టంగూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యలపై నిర్లక్ష్యం తగదని లయన్స్ క్లబ్ కట్టంగూరు కింగ్స్ సభ్యుడు అంబటి అంజయ్య అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ కట్టంగూరు కింగ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలను చిన్నచూపు చూడకుండా సరైన చికిత్స తీసుకోవాలని సూచించారు. ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి సాగర్, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివ, సహాయ కార్యదర్శి బసవోజు వినోద్, మంగదుడ్ల శ్రీనివాస్, రాపోలు వెంకటేశ్వర్లు, కడవేరు మల్లికార్జున్, ఉపాధ్యాయులు కొంక ఆంటోని, విఠల్, అబ్దుల్ గఫార్, చిన్ని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.4
***
ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	83,848	83,848
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.28 (4.27)	5,838.15	6,826.79
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.653 (43.7429)	82,492	82,492

చికెన్ ధరలు	లైవ్: రూ.140	డ్రెస్: రూ.210	స్కిన్‌లెస్: రూ.240

నకిలీ లెక్చరర్లలో కలకలం

- తదుపరి చర్యలకు ఇంటర్‌బోర్డు సిద్ధమైనట్లు సమాచారం
- ఇప్పటికే ఆర్‌జేడీని బాధ్యతల నుంచి తొలగింపు
- ఆరా తీసిన రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు
- చర్యలను నిలపాలని కీలక నేతలను ఆశ్రయించిన నకిలీ లెక్చరర్లు
- వారికి హామీ దక్కలేదని సమాచారం






నల్లగొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నకిలీ లెక్చరర్లు!' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో శుక్రవారం ప్రచురితమైన కథనం ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాల్లో కలకలం రేపింది. రాష్ట్ర వ్యాప్తంగా 2023లో క్రమబద్ధీకరణ పొందిన జూనియర్ లెక్చరర్లలో 700 మంది వరకు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు విచారణలో తేలిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీంతో ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు నకిలీలపై తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిణిని సెప్టెంబరు నెలాఖరులో ఆర్‌జేడీ బాధ్యతల నుంచి తప్పించినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా ఈ కథనంపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు సైతం శుక్రవారం వివరాలు సేకరించారు. నకిలీల వ్యవహారాలపై అన్ని ఆధారాలతో ఉన్నతాధికారులకు, సీబీసీఐడీకి ఫిర్యాదులు చేయడంతో పాటు, సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసిన నిరుద్యోగ జేఏసీ, తెలంగాణ విద్యారంగ పరిరక్షణ సమితి నాయకుల నుంచి వారు అన్ని వివరాలు సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇంటెలిజెన్స్ అధికారులు హైదరాబాద్, హన్మకొండ, నల్లగొండలో సమాచారం సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నకిలీ సర్టిఫికెట్ల దందాపై చర్యలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో తమ పరిస్థితి ఏంటనే దానిపై ఇటు నకిలీ లెక్చరర్లు, వారికి మద్దతుగా నిలిచిన జిల్లాల అధికారులు, ఉద్యోగసంఘాల నాయకులు హైరానా పడుతున్నారు. రాజకీయనేతల నుంచి ఒత్తిడి తెచ్చి చర్యలు తీసుకోకుండా అడ్డుకునేందుకు తదుపరి ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే కీలక నేతలు హామీ ఇవ్వడం లేదని, ఈ అంశం తమ పరిధి దాటిందని, కొన్నాళ్లు వేచి ఉండాలని సూచిస్తున్నట్లు చర్చ సాగుతోంది.

ఆందోళనలో బాలాజీ బాధితులు

- అతడి వ్యవహారాలపై పోలీస్‌శాఖ దృష్టి
- ఆస్తులు, దందాలపై ఆరాతీస్తున్నట్లు సమాచారం
- బాలాజీని పట్టుకునేందుకు రంగంలోకి పోలీసులు



నల్లగొండ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశచూపి భారీగా నగదు సమీకరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలాజీ నాయక్ లావాదేవీలపై పోలీస్‌శాఖ దృష్టి సారించింది. ఇప్పటికే మనీలాండరింగ్, డిపాజిటరీల చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ సాగిస్తున్నారు. బాలాజీకి సంబంధించిన ఆస్తులు ఎక్కడెక్కడున్నాయనే అంశాలతో పాటు, అతడు ఈ వ్యాపారానికి ఉపయోగించిన బ్యాంక్ అకౌంట్లను పరిశీలిస్తున్నారు. అదేవిధంగా బాలాజీ, అతడి కుటుంబ సభ్యులు, అతడి వద్ద పనిచేసిన ఇతర ఉద్యోగుల వివరాలు, వారిపేరున నడిపిన లావాదేవీలు, వారి పేరున ఉన్న ఆస్తుల వివరాలను సైతం సేకరిస్తున్నట్లు తెలిసింది. దాదాపు 22 బ్యాంక్ అకౌంట్ల ద్వారా బాలాజీనాయక్ లావాదేవీలు నడిపినట్లు తెలుస్తుండగా, వాటన్నింటినీ పరిశీలిస్తున్నట్లు సమాచారం మరోవైపు బాలాజీ ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. బాలాజీ నాయక్ పాస్‌పోర్టు సైతం నల్లగొండ పోలీస్‌లు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో దేశం విడిచిపోలేదని, అతడు ఎక్కడున్నా వెతికి పట్టుకొని ఒకటి, రెండు రోజుల్లో రిమాండ్‌కు తరలిస్తామని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. బాలాజీనాయక్‌కు అప్పులిచ్చి ఇబ్బందులు పడుతున్న కారణంతో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారనే సమాచారం, అతడి స్వగ్రామమైన వద్దిపట్ల గ్రామపంచాయతీ పలుగుతండాలోని ఇంటిపై దాడికి దిగిన విషయాలు బయటకు రావడంతో అప్పులిచ్చిన వారు పెద్దసంఖ్యలో నల్లగొండలో ఎస్పీ కార్యాలయానికి వస్తున్నారు. అయితే వారెవరూ నేరుగా ఫిర్యాదులు ఇవ్వకుండా డబ్బులిప్పించేలా చూడాలని పోలీసులను వేడుకుంటుండడం గమనార్హం. తాజా గా, శుక్రవారం నల్లగొండలో పలువురు గిరిజన సంఘాల నాయకులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ బాలాజీనాయక్ నమ్మకంతో పలువురు గిరిజనుల నుంచి వందల కోట్ల రూపాయలు డబ్బు సేకరించాడని, వారంద రూ ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బాలాజీ వ్యవహారంపై పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని, అతడి వెనక ఉన్న వా రి వివరాలు సైతం వెల్లడించాలని డిమాండ్ చేశారు. బాలాజీ ఎవరెవరికి విరాళాలు ఇచ్చారనే అంశాన్ని సైతం తేల్చాలని డిమాండ్ చేశారు. ఆదివారంలోగా బాధితులకు ఉపశమనం కలిగే చర్యలు తీసుకోకపోతే నల్లగొండలో నంగారాభేరీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తామని ఆ సంఘం నాయకులు శ్రీనునాయక్, గణేశ్ నాయక్, రమేష్‌నాయక్, తదితరులు తెలిపారు.



సిండికేట్లపై ఎక్సైజ్‌శాఖ నిఘా

మద్యం దుకాణాలకు దరఖాస్తులు తక్కువగా రావడానికి కారణాలు ఏమిటనే దానిపై ఎక్సైజ్‌శాఖ మల్లగుల్లాలు పడుతోంది. దరఖాస్తుల సంఖ్య తగ్గడం అనేది రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. దీంతో కారణాలను వెతికి రానున్న రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెంచుకునేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- దరఖాస్తులు తక్కువగా రావడంపై ఆరా
- 15 రోజుల్లో వచ్చినవి 96 దరఖాస్తులే
- దరఖాస్తులు తగ్గితే రీ-నోటిఫైకు ఆలోచన
- ప్రభుత్వ ఆదాయానికి గండి పడితే చర్యలకు ఉపక్రమణ

మద్యం టెండర్లకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై 15రోజులైనా జిల్లాలో మొత్తం 96 దరఖాస్తులే వచ్చాయి. ఈనెల 11న రెండో శనివారం అయినా సెలవు లేకుండా దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించారు. రానున్నవి మంచి రోజులే కావడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్‌శాఖ భావిస్తోంది. దసరాకు ముందే మద్యం టెండర్లకు నోటిఫికేషన్ జారీ కాగా, గత నెల 26 నుంచి దరఖాస్తులు తీసుకునే ప్రక్రియను ప్రారంభించారు. ఈనెల 18తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది. దసరా పండుగకు భారీగా దరఖాస్తులు వస్తాయనే నమ్మకంతో ముందుగానే నోటిఫికేషన్ జారీ చేసినా, రెండు వారాలు దాటినప్పటికీ దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగానే సాగుతోంది. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చేందుకు గతంలో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండగా, ఈ సారి ప్రభుత్వం దాన్ని రూ.3లక్షలకు పెంచింది. అయితే దరఖాస్తులు ఎక్కువగా రాకపోవడానికి ఫీజును లక్ష రూపాయలకు పెంచడమే కారణమా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈనెల 23వ తేదీన లాటరీ విధానంలో దుకాణాలు కేటాయించాల్సి ఉంది. ఈనెల 18తో దరఖాస్తుల ప్రక్రియ ముగియనుండగా, దరఖాస్తులు తక్కువగా వస్తే ఏం చేయాలనే దానిపై ప్రభుత్వంతో పాటు ఎక్సైజ్‌శాఖ అధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

సిండికేట్‌తోనే దరఖాస్తులు తగ్గాయనే అనుమానాలు

దరఖాస్తులు తగ్గడానికి మద్యం వ్యాపారాల్లో తలపండిన కొందరు సిండికేట్‌గా మారి ఆయా దుకాణాలకు దరఖాస్తులు రాకుండా నయానో భయానో నచ్చజెబుతున్నట్లు ఎక్సైజ్‌శాఖ గ్రహించినట్లు సమాచారం. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు రాకుండా చూస్తుండటంతో ఆ దుకాణాలకు రీనోటిఫై చేసి మళ్లీ దరఖాస్తులు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఈనెల 18లోగా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకుంటే సిండికేట్ అయినట్లుగా భావించి ప్రభుత్వం ఆదాయానికి గండి పడకుండా నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సిండికేట్లపై చట్టపర చర్యలు తీసుకునేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయం పెద్ద ఎత్తున రావాలంటే సెలవు రోజులు మినహా ఈ ఎనిమిది రోజుల్లో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రాబడితే కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మద్యం షాపుల యజమానులతో పాటు బార్ల యజమానులు కూడా సిండికేట్‌గా మారినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో దుకాణాల వారీగా గతంలో వచ్చిన దరఖాస్తులు తగ్గకుండా చూడాలని, అవసరమైతే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం రానున్న రోజులన్నీ మంచిగా ఉండటంతో చివరి నాలుగైదు రోజుల్లో దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వస్తాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిర్భయంగా దరఖాస్తు చేసుకునేలా

మద్యం దుకాణాలకు నిర్భయంగా దరఖాస్తు

- మిగతా 8వ పేజీలో...

● ఉర్సులో భక్తుల రద్దీ



జిల్లా కేంద్రంలో లతీఫుల్లా షాఖాద్రీ ఉర్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం జరిగిన ప్రార్థనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



పీహెచ్‌సీలో రోగితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గొడకొండ్ల పంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి ఓపీ సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను మరింత మెరుగుపరచాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కల్యాణ్ చక్రవర్తి, వైద్యాధికారి వంశీకృష్ణ, తదితరులు ఉన్నారు.

పేరూరు వంతెనను పునరుద్ధరించాలి

- అంచనాలు రూపొందించండి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



పేరురులో బ్రిడ్జిని పరిశీలించి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డితో చర్చిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీ వర్షాల కారణంగా తెగిన పేరూరు వంతెన తాత్కాలిక పునరుద్ధరణకు అంచనాలు రూపొందించి సమర్పించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి పేరూరు శివారులో తెగిన వంతెనను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వంతెన తెగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అంచనాలు రూపొందించాలని, శాశ్వత ప్రాతిపదికన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి సైతం ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం అనుముల తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజేందర్, డీఈ సతీష్, ఏఈ సాయిరెడ్డి, మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, తహసీల్దార్ రఘు, ఎంపీడీవో సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, కాంసాని చంద్రశేఖర్, కాకునూరి నారాయణగౌడ్, రాంబాబు, నాగరాజు, గౌస్, పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): విద్యార్థులకు విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించాలని, అందులో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రం సమీపం ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ప్రభుత్వం అన్ని మౌలిక వసతులకు నిధులు మంజూరు చేసినా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

(ఆంధ్రజ్యోతి, నకిరేకల్): రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాటికల్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. ఆమె వెంట డీసీవో పత్యానాయక్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేశం ఉన్నారు.

యథావిధిగా 'ప్రజావాణి'

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికలను హైకోర్టు ఆదేశాలతో నిలిపివేసినందున ఈనెల 13న (సోమవారం) 'ప్రజావాణి' కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజలు 'ప్రజావాణి'కి హాజరై సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాలు



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు అనువైన స్థలాన్ని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ శుక్రవారం పరిశీలించారు. హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డును పరిశీలించారు. సుమారు నాలుగు ఎకరాల స్థలాన్ని మార్కెట్ యార్డులో సేకరించేందుకు ప్రభుత్వానికి నివేదిక అందించిన క్రమంలో త్వరలోనే అనుమతులు రానున్నట్లు తెలిసింది. తొలుత ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మించనున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకే సముదాయంలో ఏర్పాటు చేసేందుకు ఇక్కడి స్థలాన్ని సేకరించనున్నట్లు తెలిసింది. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ అనిల్, ఇన్‌చార్జి ఎంపీడీవో భిక్షంరాజు, ఎస్ఐ వీరశేఖర్, పీఆర్ ఏఈ సైదులు, నాగిరెడ్డి, గురునాథం, హనుమంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈవో భిక్షపతి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

కేతేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివి పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో బొల్లారం భిక్షపతి, మండల ప్రత్యేకాధికారి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపీకృష్ణ అన్నారు. శుక్రవారం కేతేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో భిక్షపతి, చెరుకుపల్లి కేజీబీవీని డీఎం గోపీకృష్ణ వేర్వేరుగా తనిఖీచేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. కేజీబీవీలో వంటగదిని పరిశీలించిన డీఎం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వారి వెంట ఎంఈవో ఎ.రాజేంద్రప్రసాద్, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎం.వసంత, ప్రధానోపాధ్యాయులు వి.రఘు, అశ్విని, సీఆర్పీ కె.మహేందర్, తదితరులు ఉన్నారు.

పెన్షన్ ఉద్యోగుల హక్కు

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ ప్రభుత్వ భిక్షకాదని, ఉద్యోగుల హక్కు అని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. కేంద్రం వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన సీపీఎస్, ఎన్‌పీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల హక్కులను హరించే పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టాప్రా జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే ఐదు విడతల కరువు భత్యాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పందిరి శ్యాంసుందర్, కుకుడాల గోవర్ధన్, కొప్పు రామచంద్రం, కేసాని భిక్షంరెడ్డి, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, గుండాల భిక్షమయ్య, రాఫెల్, రాపోలు వెంకటేశం, పటేటి కృష్ణయ్య, అంజిరెడ్డి, పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి



సాగర్ ఏరియా ఆస్పత్రిలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రి సిబ్బంది నిరసన

నాగార్జునసాగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న తమకు సకాలంలో వేతనాలు అందించాలని కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులు, సిబ్బంది డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆస్పత్రి ఓపీ బ్లాక్ ఎదుట వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సెప్టెంబరు నెల పూర్తయి 10 రోజులు గడుస్తున్నా నేటికీ వేతనాలు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ నెల 1వ తేదీనే వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల వేతనాలు ఆలస్యం అవుతున్నా సర్దుకుపోతున్నామన్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే వేతనాలు ఆలస్యమవుతున్నాయని వాపోయారు. ఇక నుంచి ప్రతీ నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని, లేదంటే రాష్ట్ర జేఏసీ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ మోతీలాల్, చక్రవర్తి, ఫార్మసిస్ట్ శ్రీజ్యోతి, హెడ్ నర్స్ సత్తెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదు

బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు



నల్లగొండలో నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయపరంగా దక్కాల్సిన స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను హైకోర్టు ద్వారా నిలిపివేయించిన బీసీ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర హైకోర్టు స్టే ఇవ్వడానికి నిరసనగా శుక్రవారం బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు క్లాక్‌టవర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నేలపట్ల సత్యనారాయణ, దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడంతో బడుగు బలహీన వర్గాల నోటికాడి ముద్దను లాక్కున్నట్టు అయిందన్నారు. 80శాతం జనాభా ఉన్న బీసీలకు రావాల్సిన రాజకీయ వాటాను అగ్రవర్ణాలు అనుభవిస్తూ, దేశ సంపదను స్వప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు. బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లను జీర్ణించుకోలేక హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసు వేశాయన్నారు. కోర్టులో కేసులు వేసిన ఆధిపత్య కులాల నాయకులకు, చట్టరూపం దాల్చకుండా చివరి వరకు ప్రయత్నించిన కొన్నిపార్టీల వైఖరికి నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు కేశబోయిన శంకర్ ముదిరాజ్, నల్ల సోమమల్లన్న, చొల్లేటి ప్రభాకర్, వైద్యుల సత్యనారాయణ, చిక్కుళ్ల రాములు, వాడపల్లి సాయిబాబా, గోలి విజయ్ కుమార్, జెల్లా ఆదినారాయణ, పుట్టా వెంకన్న, మిరియాల యాదగిరి, పసుపులేటి సీతారాములు, గంజి భిక్షమయ్యనేత, గుండె వెంకటేశ్వర్లు, జివ్వాజి ఇంద్రయ్య, చిలకరాజు సతీష్, మునాస ప్రసన్న, ఐతరాజు జనార్ధన్‌గౌడ్, నల్ల మధు యాదవ్, నేలపట్ల చంద్రశేఖర్, మాధవి, కర్నాటి యాదగిరి, కందుల వెంకటేష్, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డిండి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డిండి మండలంలోని చెర్కుపల్లి, ఎర్రారం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏడీ సైదులు, ఏఈ శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. చెర్కుపల్లి, ఎర్రారం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి వినతి

చింతపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్)లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్‌కు గ్రామస్థులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రధాన వీధుల్లో చెత్త సేకరణకోసం ఆటోను ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ఆటో అందుబాటులో లేకపోవడంతో చెత్తా చెదారం పేరుకపోతుందన్నారు. రాత్రివేళ హైమాస్ట్ దీపాలు వెలగకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామన్నారు.

బ్రిడ్జి నిర్మాణమెప్పుడో?

● మూడేళ్లుగా సాగుతున్న నిర్మాణం ● వర్షాలకు తెగుతున్న డైవర్షన్ రోడ్డు ● ఇబ్బందులుపడుతున్న ప్రజలు



ఊట్కూరులో పిల్లర్ల దశలో ఉన్న బ్రిడ్జి పనులు

నిడమనూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు-నందికొండవారిగూడెం గ్రామాల నడుమ నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊట్కూరులో ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో గతంలో కురిసిన వర్షాలకు అనేకసార్లు తెగిపోయింది. ఊట్కూరు, నందికొండవారిగూడెం గ్రామాలతోపాటు సోమారిగూడెం, గౌండ్లగూడెం, లక్ష్మీపురం, ముప్పారం తదితర గ్రామాల ప్రజలు ఈ కల్వర్టు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టు తెగడంతో రాకపోకలు నిలిచిపోయి ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులుపడేవారు. నల్లగొండ ప్రధాన రహదారి మీదుగా ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. దీంతో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఎట్టకేలకు కల్వర్టు స్థానంలో వంతెన నిర్మించేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. కానీ పనులు మొదలు కాలేదు. వంతెన నిర్మాణం ఆవశ్యకతను గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం రూ.3.50కోట్లు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. కానీ ఏళ్ల తరబడి పనులు సాగుతున్నా నిర్మాణం మాత్రం ఇప్పటివరకు పూర్తికాలేదు. వేసవికాలంలో పనులు ఆపేసి, వర్షాకాలంలో పనులు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపణలు చేస్తున్నారు. కల్వర్టు స్థానంలో వంతెన నిర్మిస్తున్నందున రాకపోకలకు అనువుగా ఉండేందుకు డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. కానీ ఇటీవల తరచుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా వరద ఉధృతికి అనేకసార్లు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. తరచూ వాగు పొంగడం, డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడం, తాత్కాలికంగా మట్టి పోయడం వంటి పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున ఇప్పటికైనా పనులు వేగవంతం చేసి సత్వరమే వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



ఊట్కూరులో బ్రిడ్జి నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. తరచుగా కురుస్తున్న భారీ వర్షాలకు డైవర్షన్ రోడ్డు అనేకసార్లు తెగిపోయింది. ఈమార్గంలో వివిధ గ్రామాల ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారు. వర్షాల కారణంగా వరదనీరు ప్రవహిస్తుండటంతో రోడ్డు తెగి రాకపోకలు నిలిచిపోవడంతో ఇబ్బందులుపడుతున్నాం. సకాలంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

నర్సింగు రామలింగం, ఊట్కూరు.

రూ.3.50 కోట్ల నిధులతో బ్రిడ్జి నిర్మాణం

ఊట్కూరులో రూ.3.50 కోట్ల నిధులతో వంతెన నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా డైవర్షన్ రోడ్డు తెగిపోయినప్పటికీ రాకపోకలు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిర్మాణ పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

సాయిప్రసాద్, పీఆర్ ఏఈ

వానొస్తే.. రాకపోకలు బంద్



శ్రీనివాస్‌నగర్ వద్ద లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు.

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వర్షాలు వస్తే రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్ చెరువు వద్ద 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లోలెవల్ బ్రిడ్జిపై నుంచి చెరువు నిండి అలుగుపారుతుంది. ఈ వంతెన మీది నుంచి ధీరావత్‌తండా, జటావత్‌తండా, కొత్తసామెగానితండా ప్రజలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో వచ్చే నీటితో చెరువు పూర్తిస్థాయిలో నిండి ప్రస్తుతం ఉన్న వంతెనపై వరద ప్రవాహం సాగుతుండడంతో చెరువు కింది పొలాల్లోకి వరద ప్రవహించి నీట మునిగిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం గతంలో హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటుకు ప్రతిపాదనలు చేపట్టినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

వర్షాలు వస్తే ఇబ్బందులే



వర్షాకాలం వస్తే రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెరువు నిండి లోలెవల్ వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురై ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జప్తివీరప్పగూడెం మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. హైలెవల్ బ్రిడ్జిత

సైదానాయక్, రైతు, కొత్తసామెగానితండా

సాంకేతిక విద్యపై అవగాహన పెంచాలి

● ఎంఈవో బాలు



అవగాహన కల్పిస్తున్న ఎంఈవో బాలు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యపై విద్యార్థులకు అవగాహన పెంచాలని ఎంఈవో లావూరి బాలు అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో డిజిటల్ లెర్నింగ్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కృత్రిమ మేధపై అవగాహన పెంచేందుకు ఉన్నత పాఠశాలల్లో పైథాన్, ఆడినో, కంప్యూటింగ్, కోడింగ్ ఆధారిత శిక్షణను అందించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ఉపాధ్యాయులు బట్టీ విధానానికి స్వస్తి పలికి, విద్యార్థులను ప్రయోగాత్మక విద్యవైపు ప్రోత్సహించాలని సూచించారు. మారుతున్న విద్యావిధానాలపై నైపుణ్యం పెంచుకోవాలని, అవసరానికి అనుగుణంగా బోధనా పద్ధతులు మార్చుకోవాలని టీచర్లకు సూచించారు. ఏఐ శిక్షణ మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కోర్సు ఇన్‌చార్జి విజయలక్ష్మి, రిసోర్స్ పర్సన్లు మాధవి, ఉమారాణి, జ్యోతి, సువర్ణ, పుష్ప, నాగలత, పద్మ, సునంద వెంకటరెడ్డి, సైదిరెడ్డి, పండిట్ రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలి

● మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్



స్కానర్లను అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించాల్సిన అవసరముందని మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన లోక కల్యాణ మేళ పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిరు వ్యాపారులను ప్రోత్సహించడంతోపాటు వారికి ఆర్థికపరమైన అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు రూపొందించడం ఉపపయోగకరమన్నారు. వీధి వ్యాపారులు ఆర్థిక లావాదేవీల విషయంలో నష్టపోకుండా ఉండేందుకు నగదురహిత సేవలు దోహదపడుతాయన్నారు. ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి కింద మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకుల సహకారంతో రుణాలు అందించడంతోపాటు వారి నైపుణ్యాలను మెరుగుపరచడం, ఆర్థిక అక్షరాస్యత కల్పించనున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని చిరు వ్యాపారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, బక్కయ్య, శ్రీనివాసాచారి, వీటీ, పార్వతి, శ్వేత పాల్గొన్నారు.

నేలకొరిగిన వరిపంట



వర్షాలకు నేలవాలిన పంట పొలం

మాడ్గులపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షానికి చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతులు అకాల వర్షం కురవడంతో చేతికొచ్చిన పంట నేలకొరగడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలోని ఆగా మోత్కూరు, చిరుమర్తి, పాములపాడు, కల్వలపాలెం, గుర్రప్పగూడెం గ్రామాల్లో కురిసిన వర్షానికి వరి పంట నేలకొరిగింది. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినప్పటికీ తీరా కోతకొచ్చే సమయానికి వర్షం రావడంతో రైతులకు నష్టం కలిగిస్తుంది. మండలవ్యాప్తంగా సుమారు 50 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. గురువారం మండలంలోని పాములపాడు, కల్వలపాలెం, చిరుమర్తి, పోరెడ్డిగూడెం గ్రామాల్లో నేలకొరిగిన పంటను ఏవో శివ రాంకుమార్ పరిశీలించారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

పెద్దవూర, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో తగిన గౌరవ లభిస్తుందని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ముడావత్ ఛత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో రూ.22లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి కంప్యూటర్ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వసతిగృహ అధికారి కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు సైదులు, శ్రీనునాయక్, కృష్ణ, ఫహీన్, శాంతి, శివలీల, ఏఎన్ఎం జ్యోతి, సిబ్బంది సాంబయ్య, చిన్న, నాగేందర్ పాల్గొన్నారు.

నకిలీ సాదాబైనామాతో భూకబ్జాకు యత్నం

చందంపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిళ్లపురం గ్రామంలో నకిలీ సాదా బైనామాతో భూములను కబ్జాచేసే ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని సర్వేనెంబర్ 221లో నక్క సత్తెమ్మ, సర్వేనెంబర్ 58లో ఉప్పునూతల చెన్నకేశవులకు చెందిన ఐదు ఎకరాలు, గ్రామకంఠం సర్వేనెంబర్ 35లో 35 ఎకరాలను అదే గ్రామానికి చెందిన సంజీవ నకిలీపత్రాలను సృష్టించి భూమి రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న భూ యజమానులు శుక్రవారం చందంపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంజీవపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీ వ్యతిరేకులను తరిమికొట్టాలి



మిర్యాలగూడలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీ వ్యతిరేకులను తరిమికొట్టాలని బీసీసంఘాల నేతలు పిలుపునిచ్చారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు విద్య, వ్యాపార సంస్థలు సహకరించాలని కోరుతూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులలో కొందరు రాష్ట్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయగా, మరికొందరు బస్టాండు, సబ్ కలెక్టర్ కార్యాలయాల ఎదుట రాస్తారోకో నిర్వహించారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని రెడ్డి జాగృతి కోర్టును ఆశ్రయించడం తగదన్నారు. తరతరాలుగా దగాకు గురవుతూ ఓట్లు వేసే యంత్రాలుగా తమను వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ నోటి కాడి ముద్దను లాక్కోవద్దని, రిజర్వేషన్ల అమలుకు అడ్డుపడకుండా సహకరించాలన్నారు. కాగా సామాజిక కార్యకర్త డాక్టర్ జాడి రాజు బీసీ జేఏసీకి మద్దతు ప్రకటించారు. కార్యక్రమాల్లో గాదగోని మహేష్‌గౌడ్, బంటు వెంకటేశ్వర్లు, లింగంపల్లి చిరంజీవి, పోగుల సైదులుగౌడ్, తిరుమలగిరి అశోక్, ఎర్రబెల్లి దుర్గయ్య, చేగొండి మురళి, దోనేటి శేఖర్, కాతోజు వినోద్, సైదులు, నరేష్, నాగేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

దేవరకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఎన్నికలను వాయిదా వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పి, బీసీలను మోసం చేశారన్నారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు చొల్లేటి భాస్కరచారి, శీను, కోటేశ్వర్‌రావు, కృష్ణమాచారి, కృష్ణ యాదవ్, భిక్షమయ్య, తోటపల్లి శ్రీను, జ్యోతిబసు, చందునాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

'రాజాసింగ్‌పై చర్య తీసుకోవాలి'

దేవరకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్తపై వివాదస్పద వ్యాఖ్యలు చేసి ముస్లింల మనోభావాలను కించపరిచిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్య తీసుకోవాలని దేవరకొండకు చెందిన జమియత్ ఏ ఉలేమా నేతలు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్య తీసుకోవాలని శుక్రవారం దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మతపెద్ద ముక్తి జావిద్ ఉస్సేన్ మాట్లాడుతూ భారతదేశం శాంతికి చిహ్నమని, మతసామరస్యానికి నిలయమన్నారు. రాజకీయ లబ్ధికోసం మత చిచ్చుపెట్టి తాత్కాలికంగా లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో దేవరకొండ ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అజీమొద్దిన్, ఇస్లాయమ్ అశర ఖాజా షైనొద్దిన్, ఇలియాజ్ పటేల్, అలీమొద్దిన్, ఇలియాజ్ బాబా, సోయబ్ తదితరులు ఉన్నారు.

సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదే

● ఆర్డీవో రమణారెడ్డి




మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదేనని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ చట్టంతో పాలనలో జవాబుదారీతనాన్ని పెంచవచ్చని తహసీల్దార్ రాగ్యానాయక్ అన్నారు. ఆర్టీఐ వచ్చి 20 ఏళ్లు అవుతున్న సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్టీఐ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిని అంతం చేయడానికి, ప్రభుత్వ సంస్థల పనితీరులో పారదర్శకత పెంపొందించడానికి భారత ప్రభుత్వం ఆర్టీఐ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుడికి 30రోజుల్లో తప్పకుండా తగిన సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యామ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సాయి, ఏఎస్‌వో శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ స్వామి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలింతలు పోషకాహారం తీసుకోవాలి



చందంపేట మండలం తెల్‌దేవరపల్లిలో సీమంతం చేస్తున్న సిబ్బంది

చందంపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాలింతలు, చిన్నారులు, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని తెల్‌దేవరపల్లి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. శుక్రవారం చందంపేట మండలం హంక్యతండాలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీమంతాలు, అన్నప్రాసన, వెల్‌బేబిషో కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవడంతో రక్తహీనత బారినపడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం : సక్కుబాయి

చింతపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పోషక విలువలు కలిగిన సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీవో సక్కుబాయి అన్నారు. పోషణ అభియాన్‌లో భాగంగా శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ఆరోగ్యంగా ఉండాలంటే పాలకూర, పాలు, గుడ్లు బీట్‌రూట్, బొప్పాయి తీసుకోవాలన్నారు. రక్తహీనతనుంచి విముక్తి పొందడానికి అధికశాతం విటమిన్లు కలిగిన ఆహారం తినాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జగ్‌రాం, సూపర్‌వైజర్లు పార్వతి, అంజమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో పౌష్టికాహారం : చంద్రకళ

వేములపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాలబాలికలు కౌమారదశనుంచే చిరుధాన్యాలు, మిల్లెట్స్ తీసుకుంటే సమతుల ఆహారం అంది సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పోషక మాసోత్సవాన్ని నిర్వహించి బాలబాలికలకు తీసుకోవాల్సిన ఆహార, ఆరోగ్యజాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై, బాల్య వివాహాలపై తగిన అగవాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీఒక్కరు చక్కెర, ఉప్పు, నూనె వినియోగాలను తక్కువగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని, ప్రిన్సిపాల్ సుజాత, సీహెచ్‌వో ప్రవీణ్, హెల్త్ సూపర్‌వైజర్ శాంతా, ఏఎన్ఎం శైలజ, అంగన్‌వాడీ టీచర్లు శశికళ, జయమ్మ, ఆశాలు, బాలికలు, బాలురు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులపై మానవత్వం చూపండి

● సీనియర్ సివిల్ జడ్జి బత్తుల సుజయ్

మిర్యాలగూడ లీగల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగులపై మానవత్వం చూపాలని సీనియర్ సివిల్ జడ్జి బత్తుల సుజయ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆశాజ్యోతి మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి సుజయ్ మాట్లాడుతూ దివ్యాంగులపై దురుసుగా ప్రవర్తిస్తే శిక్షార్హులు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు మేక కుమార్‌రెడ్డి, ధూపాటి మట్టయ్య, రాజశేఖర్‌నాయక్, భాస్కర్, మండల న్యాయ సేవా సంస్థ నిర్వాహకురాలు మేడి మహేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా భగత్ జన్మదిన వేడుకలు

హాలియా, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భగత్‌కు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ గజమాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం భగత్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మొక్కలను నాటారు. పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, వడ్డె సతీష్‌రెడ్డి, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, శ్రీనివాస్ రెడ్డి, జటావత్ రవినాయక్, నల్లగొండ సుధాకర్, చెన్ను సుందర్‌రెడ్డి, కామెర్ల జానయ్య, సురభి రాంబాబు, పొదిల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, నాయకులు భిక్షనాయక్, చెవ్వా నాసర్‌రెడ్డి, నాగెండ్ల వెంకట్‌రెడ్డి, కోటిరెడ్డి, నందానాయక్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

హాలియా, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి అన్నారు. కేంద్ర సామాజిక న్యాయం, అధికార పరిరక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే నమస్తే క్యాంప్‌ను శుక్రవారం హాలియాలో ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

కొండమల్లేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణకేంద్రంలోని స్థానిక సాగర్ రోడ్డులో గల వాసవీ మాత ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ, గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కర్నాటి శ్రీనివాస్, తేరటిపల్లి బుచ్చిరాములు, సోమ జగన్మోహన్, గాయత్రి పరివార్ సభ్యులు చంద్రమౌళి, దాచేపల్లి వెంకటేశ్వర్లు, చిత్తరంజన్‌రెడ్డి, యాద వరలక్ష్మి, అజిత, దుండిగళ్ల మాధవి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

దేవరకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2, 3 తేదీల్లోనే వేతనాలు చెల్లించాలని దేవరకొండ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రాంతీయ వైద్యశాల ఎదుట వేతనాలు ఆలస్యంగా వస్తున్నాయని ప్లకార్డులతో కొద్దిసేపు నిరసన తెలిపి మాట్లాడారు. వేతనాలు 10వ తేదీ తర్వాత ఆలస్యంగా వస్తున్నాయని, దీంతో ఇబ్బందులుపడుతున్నామన్నారు. ప్రతీనెల 2, 3 తేదీల్లో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది రోజారాణి, సువర్ణలత, కోటేశ్వర్‌రావు, ఉప్పలయ్య, అర్చన, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆర్థిక అవసరాలను గుర్తించి సకాలంలో వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ వైద్యశాల ఉద్యోగులు డిమాండ్‌చేశారు. కొన్ని నెలలుగా 010 పద్దు ద్వారా వేతనాల చెల్లింపు ప్రక్రియ సక్రమంగా జరపకపోవడంపై వైద్యసిబ్బంది మౌనపదర్శనతో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ వేతనాలు సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నెలసరి ఈఎంఐలు ఉన్నవారు వడ్డీలకు అప్పులుతెచ్చి ఆర్థిక ఇబ్బందులను సరిపోట్టుకోవాల్సి వస్తుందంటూ వాపోయారు. ప్రతి నెల 1న వేతనాలు అందించాలని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వైద్యసిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, మినిస్ట్రీయల్ సిబ్బంది పాల్గొన్నారు.

సిండికేట్లపై ఎక్సైజ్‌శాఖ నిఘా

(5వపేజీ తరువాయి)

చేసుకోవాలని వ్యాపారులకు ఎక్సైజ్‌శాఖ విజ్ఞప్తి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం విధానానికి అనుగుణంగా జిల్లాలో మొత్తం 154 రిటైల్ మద్యం దుకాణాలకు అధికారులు దరఖాస్తులు తీసుకుంటున్నారు. కొత్త దుకాణాల లైసెన్స్ కాలం ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి, 2027 నవంబరు 30 వరకు కొనసాగనుంది. జిల్లాలో 154 దుకాణాల్లో ఎస్టీ వర్గానికి నాలుగు, ఎస్సీ వర్గానికి 14, గౌడ సామాజికవర్గానికి 34 కేటాయించారు. ప్రతీ దరఖాస్తుకు రూ.3లక్షలు (నాన్ రిఫండబుల్ ఫీజు) డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చలాన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులను ఒత్తిడితో పాటు ప్రలోభాలు గురిచేస్తున్న నేపథ్యంలో వారు ఎలాంటి భయానికి గురికాకుండా దరఖాస్తు చేయాలని ఎక్సైజ్‌శాఖ అధికారులు కోరుతున్నారు. ఈనెల 18 చివరి రోజు వరకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు పెద్ద సంఖ్యలో తీసుకునేలా ఎక్సైజ్‌శాఖ ప్రణాళిక రూపొందించింది. సెలవు రోజు మినహా ఎనిమిది రోజులే ఉన్నందున దరఖాస్తులు ఏమేరకు పెరుగుతాయనేది వేచిచూడాల్సిందే.

దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు

దరఖాస్తుల సంఖ్య రానున్న రోజుల్లో భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. మంచి రోజులను దృష్టిలో ఉంచుకొని కొంతమంది దరఖాస్తు సమర్పించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మద్యం దుకాణాలకు నిర్భయంగా దరఖాస్తు చేసుకోవాలి. ఎవరైనా సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు రాకుండా చేస్తే ఆ దుకాణాలను రీనోటిఫై చేసి సంబంధిత వ్యక్తులపై చట్టపర చర్యలు తీసుకుంటాం. ఈనెల 18 వరకు దరఖాస్తులకు గడువు ఉంది. ప్రభుత్వ ఆదాయానికి గండిపెట్టేలా దరఖాస్తుదారులను అడ్డుకుంటే ఉపేక్షించేది లేదు.

సంతోష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్